# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 17-6-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 276 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన

### కారులో డోర్ లాక్ కావడంతో ఊపిరాడక ఇద్దరు పిల్లలు మృతి

లక్నో,జూన్16(ఆర్ఎన్ఎ): ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో మంగళవారం దారుణం జరిగింది. పిల్లలు కారులో ఆడుకుంటుండగా.. డోర్ లాక్ కావడంతో ఊపిరాడకుండా మృతిచెందారు. ఈ ఘటన అక్కడివారిని కలిచివేసింది. నాలుగు నుంచి ఏడు సంవత్సరాల వయసున్న నలుగురు పిల్లలు ఇంటి ముందున్న కారులో ఆడుకుంటుండగా డోర్ లాకయింది. ఆ విషయాన్ని కారు యజమాని కూడా గమనించలేదు. కొంత సమయం తర్వాత పిల్లలు కనిపించక పోవడంతో ఇంటి సభ్యులంతా వెతికారు. కాసేపటికి పిల్లలు కారులో ఇరుక్కుపోయారని గుర్తించారు. వెంటనే తాళాలతో డోర్ ఓపెన్ చేసి చూడగా.. నలుగురు పిల్లలు అపస్మారకస్థితిలో ఉన్నారు. హుటాహుటిన వారందరిని స్థానిక ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు ఇద్దరు పిల్లలు మరణించారని ధృవీకరించారు. మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

'నలుగురు పిల్లలు కారులో అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరు మరణించగా.. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. పిల్లలంతా ఒకే కుటుంబానికి చెందినవారు. ఈ దారుణ ఘటన మంగళవారం ఉదయం జరిగిందని మొరాదాబాద్ పోలీసు సూపరింటెండెంట్ అమిత్ కుమార్ ఆనంద్ తెలిపారు.

# చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తత

### కాల్పుల్లో ముగ్గురు భారత్ జవాన్లు మృతి

### త్రివిధ దళాధిపతులతో రాజ్‌నాథ్ అత్యవసర సమావేశం

న్యూఢిల్లీ,జూన్16(ఆర్ఎన్ఎ): ఓ పక్క శాంతి మంత్రం జపిస్తూనే, మరోవైపు చైనా కయ్యానికి కాలు దువ్వుతోంది. ఈ క్రమంలో లడఖ్‌లో మరోసారి కలకలం చెలరేగింది. చైనా బలగాలతో జరిగిన ఘర్షణలో ఇద్దరు భారత జవాన్లు, ఒక అధికారి మృతి చెందారు. మరోసారి అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'గాల్వన్ ప్రాంతంలో ఇరు దేశాల సైనికుల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతోన్న సమయంలో ఇరు దేశాల సైనికుల మధ్య గతరాత్రి చోటు చేసుకున్న ఘర్షణలో ముగ్గురు భారతీయ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ఇరు దేశాల అగ్రశేణి ఆర్మీ అధికారుల మధ్య చర్చలు జరుగుతున్నాయని భారత ఆర్మీ ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్‌తో అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సీడీఎస్ బిపిన్ రావత్, త్రివిధ దళాల అధిపతులను హాజరయ్యారు. 1962 యుద్ధం తర్వాత చైనా సరిహద్దుల్లో అనేక ఘర్షణలు జరిగినా, ప్రాణనష్టం జరగడం ఇదే ప్రథమం. సైనికాధికారి సహా ముగ్గురు మరణించడంతో భారత్ దీన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. భారత్ చైనా మధ్య ఉద్రిక్తతలు తగ్గుతున్నాయని సంకేతాలు అందుతున్న వేళ ఒక్కసారిగా యుద్ధవాతావరణం నెలకొంది. లడక్ గల్వన్ లోయలో నిన్న రాత్రి రెండు దేశాలూ బలగాలు ఉపసంహరించుకుంటున్న సమయంలో తలెత్తిన ఘర్షణలో భారత కల్నల్‌తో పాటు ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. చైనా బలగాలు రాళ్లు రువ్వడంతో పాటు హింసకు పాల్పడటంతో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. దీంతో ఉద్రిక్తతలు చల్లార్చేందుకు రెండు దేశాల మేజర్ జనరళ్ల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. రెండు వైపులా ప్రాణ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. తమ సైనికులపై భారత జవాన్లు దాడులకు పాల్పడ్డారని చైనా ఆరోపించింది. అయితే చైనా వైపు ఎంతమంది జవాన్లకు గాయాలయ్యా యనేది ఇంకా తెలియలేదు. ఐదుగురు చైనా జవాన్లు గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే చైనా అధికారికంగా ప్రకటించలేదు. బలగాల ఉపసంహరణ సమయంలో భారత జవాన్లు రెండు సార్లు హద్దులు మీరి దాడులకు పాల్పడ్డారని చైనా విదేశాంగ శాఖ ఆరోపించింది. వెంటనే పరిస్థితులను అదుపు చేసేందుకు రెండు దేశాల సైన్యాధికారులు చర్చలు ప్రారంభించారని చైనా విదేశాంగ శాఖ తెలిపింది. భారత బలగాల ఏకపక్ష దాడులు పరిస్థితులను దిగజారుస్తాయని చైనా హెచ్చరించింది. రెండు దేశాల మధ్య ప్రారంభమైన మేజర్ జనరల్‌ల చర్చలు ఉద్రిక్తతలు తగ్గించవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## టిమ్స్‌లో వైద్య సిబ్బంది నియామకానికి ఉత్తర్వులు

### 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): గచ్చిబౌలిలోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (టిమ్స్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన వైద్యులు, సిబ్బంది నియామకానికి వైద్య, ఆరోగ్యసేవల నియామక బోర్డు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కరోనా వైరస్ ఉధృతి నేపథ్యంలో గచ్చిబౌలిలోని టిమ్స్ దవాఖానలో బాధితులకు చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించి, అన్ని ఏర్పాట్లు చేసింది. కరోనా బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో అవసరమైన సిబ్బంది నియామకంపై వైద్య, ఆరోగ్యశాఖ దృష్టి పెట్టింది. ఈ మేరకు దవాఖానలో 499 మంది వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా, ఈ నెల 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.



ప్రగతిభవన్‌లో కలెక్టర్లతో సమావేశానికి వస్తున్న సీఎం కేసీఆర్. పక్కన సీఎస్ సోమేశ్ కుమార్, సలహాదారు రాజీవ్ శర్మ, డీజీపీ మహేందర్ రెడ్డి ఉన్నారు.

# భారత్ సరిహద్దు దాటొద్దు : చైనా ప్రకటన

హైదరాబాద్, జూన్15: లడాఖ్‌లోని గాల్వన్ వ్యాలీలో జరిగిన సైనిక ఘర్షణపై చైనా ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి జావో లిజియన్ ఇవాళ మీడియాతో మాట్లాడారు. లడఖ్ సరిహద్దు వద్ద భారత బలగాలు హద్దుమీరినట్లు ఆయన ఆరోపించారు. భారత సైన్యం దూకుడు ప్రదర్శించిందన్నారు. దాని వల్లే రెండు దేశాల సైనికుల మధ్య ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్నట్లు జావో తెలిపారు. భారత్ తమ బలగాలను హద్దుల్లో పెట్టుకోవాలని, ఏకాభిప్రాయానికి తగినట్లు ఉండాలని జావో సూచించారు. ఫ్రంట్‌లైన్ దళాలు తమ భూభాగంలోకి రాకూడదంటూ చైనా విదేశాంగ శాఖ వార్నింగ్ ఇచ్చింది. బోర్డర్ లైన్స్ ఎట్టి పరిస్థితుల్లో దాటవద్దన్నారు.

తగాల్వాన్ వ్యాలీలో జరిగిన తాజా ఘర్షణలో.. రెండు దేశాలకు చెందిన సైనికులు మృతిచెందారు. అయితే చైనా బలగాల్లో ఎంత మరణించిన దానిపై క్లారిటీ లేదు. తొలుత అయిదుగురు చైనా సైనికులు మరణించినట్లు వార్తలు వచ్చినా.. వాటిని ఆ దేశం కొట్టిపారేసింది. కానీ మృతుల సంఖ్యను వెల్లడించలేదు. భారత్‌కు చెందిన ముగ్గురు సైనికులు మృతిచెందారు. దాంట్లో ఓ కల్నల్ కూడా ఉన్నారు. అయితే గాల్వాన్ వ్యాలీలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరు దేశాల సైనికాధికారులు మంతనాలు జరుపుతున్నారు.

## బాలికలపై అత్యాచార యత్నం

### దేహశుద్ధి చేసిన స్థానికులు

హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): బాచుపల్లిలో దారుణం జరిగింది. బాలికలపై అత్యాచారయత్నం జరిగింది. ఇద్దరు బాలికలపై అటవీ ప్రాంతంలో అత్యాచారయత్నం చేసిన యువకులకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాలికలను ప్రలోభాలకు గురిచేసి బైకులపై తీసుకుని వెళ్లారని, అక్కడి స్థానికులు గమనించి వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి తమకు అప్పగించారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# తెలంగాణలో పల్లెలన్నీ బాగుపడాలి: సీఎం కేసీఆర్

హైదరాబాద్, జూన్ 16: పల్లెల అభివృద్ధికి అవసరమైన నిధులు, విస్తృతమైన అధికారాలు, కావాల్సినంత మంది అధికారులు, స్పష్టమైన విధానాలు, పాలనా సౌలభ్యంగా గ్రామాలు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలోని పల్లెలన్నీ బాగుపడి తీరాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఆకాంక్షించారు.

ఇన్ని అనుకూలతలున్న ప్రస్తుత పరిస్థితుల్లో కాకపోతే, ఇంకెప్పుడూ గ్రామాలు బాగుపడవని ముఖ్యమంత్రి అన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో వసతుల కల్పనకు, అవసరమైన పనులు చేసుకోవడానికి నరేగా వథకాన్నివ్యూహాత్మకంగా వినియోగించుకోవాలని సీఎం చెప్పారు.

ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా రైతుల భూముల్లో లక్ష కల్లాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతీ గ్రామం ప్రతీ రోజు శుభ్రం కావాల్సిందేనని, ముఖ్యమంత్రి సహా రాష్ట్రంలో అధికార యంత్రాంగంలో ఎవరికైనా సరే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి మించిన పని మరోటి లేదని సీఎం స్పష్టం చేశారు. రాబోయే రెండు నెలల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో వైకుంఠధామాల నిర్మాణం, నాలుగు నెలల్లో రైతు వేదికల నిర్మాణం పూర్తి కావాలని ఆదేశించారు. రాబోయే నాలుగేళ్లలో ఏ గ్రామంలో ఏ పని చేయాలనే విషయంలో ప్రణాళికలు రూపొందించాలని, దానికి అనుగుణంగానే పనులు చేయాలని, ఈ వివరాలతో డిస్ట్రిక్ట్ కార్డు తయారు చేయాలని సీఎం చెప్పారు.

జిల్లాల కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ లో ఇవాళ సమావేశమయ్యారు. మంత్రులు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డిజిపి మహేందర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామాల్లో కలెక్టర్లు, డిపిఓ ఆధ్వర్యంలో జరగాల్సిన పనులపై ముఖ్యమంత్రి మార్గదర్శకం చేశారు.

## తగ్గుతున్న మద్యం అమ్మకాలు

### ఆదాయాలు దెబ్బతినడంతో మద్యానికి దూరంగా జనం

హైదరాబాద్,జూన్16(ఆర్ఎన్ఎ): ప్రజల ఆదాయం గణనీయంగా తగ్గడంతో చాలామంది మద్యం విషయంలో ఆచితూచి అడుగులేస్తున్నారు. దీనికితోడు ధరలు పెంచడంతో మద్యం విషయంలో ప్రజలు ఎవరికి వారు కంట్రోల్ విధించుకున్నారు. ఈ ఎండాకాలంలో బీర్ల అమ్మకాల్లో భారీ తగ్గుదల కనిపించింది.

ఇదివరకు ఆరోగ్యం క్షీణిస్తుందని, జేబులకు చిల్లు పడుతుందని తెలిసినా మందుబాబులు పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఏదో సాకుతో పీకలదాక తాగేసి చిందులేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. లాక్‌డౌన్ అమలలో ఉన్నందున పని దొరకక, చేతిలో పైసలు లేక మద్యం ప్రియులు గిలగిలలాడారు. మళ్లీ దుకాణాలు తెరవడంతో ఎగిరి గంతేశారు. అయితే ఆదాయం లేకపోవడంతో చాలామంది మద్యం దుకాణాల వైపే వెళ్లలేదు. దీంతో కొన్నిరోజులుగా మద్యం అమ్మకాలు భారీగా తగ్గాయి. సర్కారు ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రభుత్వం 16 శాతం ధర పెంచడం, వలస కూలీలు స్వగ్రామాలకు వెళ్లడం కూడా అమ్మకాలు తగ్గడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. తెరుచుకున్న దుకాణాల్లో మొదట్లో కొన్నిరోజులు బీరు, లిక్కర్ అమ్మకాలు జోరుగా సాగినా అనంతరం తగ్గుముఖం పట్టాయి. దీంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. చివరకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు సైతం తలలుపట్టుకంటున్నారు. 25 నుంచి 30 శాతంవరకు మద్యం విక్రయాలతోనే సర్కార్‌కు ఆదాయం వచ్చేది.

# సీఎంఆర్‌ఎఫ్‌కు రూ. 11,01,000 విరాళం అందజేత



హైదరాబాద్, జూన్15 : నగరంలోని పలు సంస్థలు సీఎం సహాయనిధికి నేడు రూ.11,01,000ను విరాళంగా అందజేశాయి. కోవిడ్-19పై పోరాటంలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు పలువురు దాతలు, పారిశ్రామికవేత్తలు, ఎన్జీవోలు తమవంతు చేయూతను అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భాగంగా నగరంలోని ఫతేనగర్ స్టీల్ వ్యాపారుల అసోసియేషన్ రూ. 8,51,000, సంతన్‌బాగ్ రెసిడెన్షియల్ ఫ్లాట్స్ అసోసియేషన్ రూ. 1,50,000, సికింద్రాబాద్‌కు చెందిన పుష్పా ట్రేడింగ్ కంపెనీ రూ. 1,00,000ను విరాళంగా సీఎంఆర్ఎఫ్‌కు అందించాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు అందజేశారు.

## జార్ఖండ్‌లో ఇక 18 నుంచి ఇంటింటి సర్వే

రాంచీ,జూన్16(ఆర్ఎన్ఎ): జార్ఖండ్ రాష్ట్రంలో ఇటీవల ఒక్కసారిగా కరోనా కేసుల సంఖ్య పెరిగింది. పలు రాష్ట్రాల నుంచి వలస కార్మికులు తిరిగి వచ్చిన నేపథ్యంలో వైరస్ తీవ్రత పెరిగినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో కరోనా సోకిన వారిని గుర్తించేందుకు ఈ నెల 18 నుంచి భారీగా ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వారం రోజుల పాటు ఈ సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు. శ్వాస సంబంధ సమస్యలు, బీపీ, క్షయ, క్యాన్సర్ వంటి రోగాలతో బాధపడుతున్న వారి నుంచి కూడా నమూనాలు సేకరించి ప్రాధాన్యత క్రమంలో పరీక్షలు జరుపుతామని ఆ రాష్ట్ర వైద్య శాఖ కార్యదర్శి నితిన్ కులకర్ణి పేర్కొన్నారు. రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో ఐసీఎంఆర్ సర్వే జరుపుతున్నదని, దీన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని కోరినట్లు ఆయన చెప్పారు.

## కరోనా వ్యాక్సిన్ కోసం విశేష కృషి

### మన శాస్త్రవేత్తలు కూడా పరిశోధనలతో బిజీ

### కేంద్రమంత్రి -నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 16(ఆర్ఎన్ఎ): కొవిడ్-19ను ఎదుర్కొనే టీకా కోసం భారత శాస్త్రవేత్తలు, సంస్థలు విశేష కృషిచేస్తున్నాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. 'టీకా తయారీ కోసం అమెరికాలో విస్తృత ప్రయోగాలు విజవంతంగా జరుగుతునాయని విన్నామని అన్నారు. మన దేశంలో కూడా శాస్త్రవేత్తలు పరిశోధనల్లో నిమగ్నమయ్యారు. టీకా కోసం వేచి చూస్తున్నాం.' అని గడ్కరీ వ్యాఖ్యానించారు. కొవిడ్ అనంతరం ఎంఎస్ఎంఈ, ఇన్‌ఫ్రాస్టక్చర్స్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు నిర్వహించిన సమావేశంలో గడ్కరీ మాట్లాడారు. 'ప్రస్తుతం మనం ఆర్థిక యుద్ధాన్ని ఎదుర్కొంటున్నాం.. మనదేకాదు ప్రపంచం పరిస్థితి కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోందని అన్నారు. ఇప్పుడు మొత్తం ప్రపంచం చైనా గురించే ఆలోచిస్తున్నది. ప్రతి ఒక్కరూ కొత్త అవకాశం కోసం చూస్తున్నారు.' అని మంత్రి పేర్కొన్నారు. ఇండియా పెట్టుబడిదారుల కోసం అనుకూలమైన మార్గాన్ని ఏర్పరుస్తుందని తాను భావిస్తున్నానని గడ్కరీ పేర్కొన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంపునకు ప్రధాని మోడీ నాయకత్వంలోని కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. ఎంఎస్‌పీని తగ్గించాలని తాను కోరినట్లు వస్తున్న వార్తలో నిజం లేదని మంత్రి స్పష్టం చేశారు. తప్పుడు వార్తలను రైతులు నమ్మవద్దని కోరారు. అన్నదాతలను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ఆదుకుంటుందని, ఇది భవిష్య తతత్తులో కూడా పునరావృతమవుతుందని ఆయన స్పష్టం చేశారు.

## టీ ఫైబర్ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై మంత్రి కేటీఆర్ సమీక్ష

హైదరాబాద్ ,జూన్ 16: టీ ఫైబర్ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ నేడు సమీక్షా సమావేశం నిర్వహించారు. సిస్టం ఇంటిగ్రేటర్స్, ఐటీ అధికారులతో సమావేశమైన మంత్రి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాల్సిందిగా కోరారు. టీ ఫైబర్ ప్రాజెక్ట్ పూర్తితో విద్య, వైద్యం, సాగు రంగాల్లో ప్రజలకు త్వరితగతిన సేవలు అందుతా యన్నారు.

# ఆందోళన కలిగిస్తున్న పెట్రో ధరలు

### ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు రేట్లు పెంచాలా?

### ప్రధాని మోడీకి సోనియా లేఖ

న్యూఢిల్లీ,జూన్16(ఆర్ఎన్ఎ): దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తున్నదని కాంగ్రెస్ నేత సోనియా గాంధీ అన్నారు. ప్రధాని మోదీకి ఈ అంశంపై మంగళవారం సోనియా లేఖ రాశారు. ప్రజల బాధలను తీర్చడం ప్రభుత్వ బాధ్యత కావాలన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను మరింత ఇబ్బందిపెట్టడం సరికాదన్నారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ప్రజల నుంచి ప్రభుత్వం లాభం పొందే ప్రయత్నం చేస్తున్నదని సోనియా ఆరోపించారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని, తక్కువగా ఉన్న చమురు ధరల లాభాన్ని ప్రజలకు అందే విధంగా చూడాలని ఆమె తన లేఖలో కోరారు. ఇటీవల వరుసగా దేశంలో ఇంధన ధరలు పెరిగాయి. వరుసగా తొమ్మిదో రోజు కూడా ఇంధన ధరలను పెంచారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు సోమవారం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ నిర్ణయిం తీసుకొన్నాయి. పెట్రోల్ పై 48 పైసలు, డీజిల్ పై 59 పైసలు పెంచుతున్నట్టు చమురు సంస్థలు ప్రకటించాయి.

## చరిత్రలో నేటినిజం



కం॥ ప్రీతిగ - పలుజోతలు గాను
రీతిగ - చెలువొందునట్టి రేరాజనగన్
ప్రీతులతో చేతలతో
శ్రీ తిరుమల రామచంద్ర శేముషి నొందెన్ !!



-రాధశ్రీ
సెల్: 9494481210

(జూన్ 17 శ్రీ తిరుమల రామచంద్ర జయంతి..)

## కొత్తగా 10,667 పాజిటివ్ కేసులు

### 380 మంది మృత్యువాత

న్యూఢిల్లీ,జూన్16(ఆర్ఎన్ఎ): దేశ ప్రజలను కరోనా వైరస్ గజగజ వణికిస్తోంది. కరోనా ధాటికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజురోజుకు పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగిపోతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గడిచిన 24 గంటల్లో కొత్తగా 10,667 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 380 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 3,43,091 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 1,53,178 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. 1,80,013 మంది కరోనా బాధితులు కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ఇప్పటి వరకు భారత్‌లో 9,900 మంది కరోనాతో చనిపోయారు. మహారాష్ట్రలో అత్యధికంగా 1,10,744 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 4,128 మంది చనిపోయారు. తమిళనాడులో 46,504(మృతులు 479), ఢిల్లీలో 42,829(మృతులు 1,400), గుజరాత్‌లో 24,104(మృతులు 1,506), యూపీలో 14,091(మృతులు 417) కేసులు నమోదు అయ్యాయి.

## హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం

హైదరాబాద్ ,జూన్ 16: హైదరాబాద్‌లో మంగళవారం పలు చోట్ల వర్షం కురిసింది. నగరంలోని పంజాగుట్ట, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, మాదాపూర్, కూకట్‌పల్లి, మియాపూర్, తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో జంట నగరాల్లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

పలు చోట్ల రోడ్లపై వర్షం నీళ్లు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల ట్రాఫిక్ జామై వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలిగింది. రాబోయే 24 గంటల్లో పలు చోట్ల వర్షం కురిసే అవాకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.


వాసా ఫౌండేషన్
మరియు
నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి
స్మారక కవితల పోటీలు
కరోనా మహమ్మారి విజృంభన నేపథ్యంలో
ప్రజలెదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై దృష్టి సారించి
"వలస కార్మికులు"
అన్న అంశం మీద మీ కవితాస్త్రాల్ని సంధించండి

బహుమతుల వివరాలు:
- మొదటి బహుమతి : రూ.5000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- రెండవ బహుమతి : రూ.2,500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- తృతీయ బహుమతి : రూ.1,000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- 10 ప్రోత్సాహక బహుమతులు: రూ.500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం

పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం

బహుమతులు గెలుచుకున్న కవితలతో పాటు ప్రచురణకు ఎంపికచేసిన కవితలను 'నేటినిజం'లో ప్రచురించబడును.

నిబంధనలు:
1) కవిత 25 లైన్లకు మించకూడదు.
2) వలస కార్మికుల సమస్యలపైనే ఉండాలి.
3) అనువాద కవితలు పోటీకి అంగీకరించబడవు
4) కవితను ఏ పత్రికకు పంపలేదని, సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని ఈ పోటీ నిమిత్తమే రాసినదని హామీ తప్పక జత చేయాలి.
5) హామీ పత్రంతో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా తప్పని సరి.
6) ఒకరు ఒక కవితను మాత్రమే పంపవలెను.

కవితలు పంపవలసిన చిరునామా:
'నేటినిజం' దినపత్రిక, ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20.

E-mail : netinizam2020@gmail.com

కవితలు పంపాల్సిన చివరి తేది : 15-7-2020

# కరోనా కల్లోలంలో రాజకీయ విన్యాసాలు -

నేటినిజం

బుధవారం 17-6-2020

కరోనా కాలంలో ప్రజలు కష్టాలు పడుతున్నా..రాజకీయ పార్టీలు నేతలు మాత్రం తమ కార్యకలాపాలను యధావిధిగా నడిపిస్తున్నారు. కేంద్ర,రాష్ట్రాల పరిస్థితి ఇలాగే ఉంది. కేంద్రంఓల బిజెపి ర్యాలీలు, పార్టీ నేతలతో వర్చువల్ సమావేశాలతో బిజీగా ఉంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు,కరోనా భయాలు ప్రజలకే తప్ప నాయకులకు లేకుండ ఆపోయింది. గుజరాత్‌లో ఒకటి, రెండు రాజ్యసభ స్థానాలను అదనంగా గెలుచు కోవడం కోసమై కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆకర్షించే పనిలో భారతీయ జనతా పార్టీ పెద్దలు బిజీగా ఉన్నారు. అలాగే రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మధ్యప్రదేశ్ తరహాలో కూలగొట్టడం ఎలా? అన్న దానిపై కూడా ఆ పెద్దలు తమ ఆలోచనలకు పదును పెడుతున్నారు. దీంతో కరోనా బారి నుంచి ప్రజలను కాపాడాల్సిన అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం.. తమ ఎమ్మెల్యేలను కాపాడుకునే పనిలో తీరిక లేకుండా ఉంది. ఇకపోతే నరేంద్ర మోడీ ప్రధానిగా రెండో దఫా పదవి చేపట్టి ఏడాది పూర్తయిన కారణంగా బిజెపి అగ్ర నేతలు వర్చువల్ ర్యాలీలతో బిజీగా గడుపుతున్నారు. ఇక ఎపిలో టిడిపి నేతల అరెస్ట్ రాజకీయాలు ఊపందుకున్నాయి. మరోవైపు అసెంబ్లీ సమావేశాలు కూడా ప్రారంభం అయ్యాయి. తెలంగాణలో కాంగ్రెస్ జలదీక్షలు, ప్రాజెక్టుల సందర్శనలకు ప్రభుత్వం కళ్లెం వేసింది. ఎక్కడిక్కడ వారిని ఇళ్లలోనే నిర్బంధించారు. బిజెపి విద్యుత్ ఆందోళనలను కూడా కెసిఆర్ సర్కార్ కట్టడి చేసింది. మొత్తంగా అధికారంలో ఉన్న పార్టీలు తమకు అనుకూలంగా నిర్ణయాలు తసీఉకుంటూ నిరంకుశంగానే ముందుకు సాగుతున్నారు. ప్రజల ఆరోగ్యాలపై లేదా, వారి ఆర్థిక ఆందోళనలపైనా పెద్దగా పట్టింపు లేకుండా ఉన్నాయి. అలాగే పెట్రో ధరలు కూడా అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్నాయి. ప్రజలపై భారం మోపడంలో ఎవరు కూడా వెనకాడడం లేదు. దీంతో నిత్యం కరోనా కేసులు పెద్దగా పెరుగుతున్నా పెద్దగ ఆపట్టింపు లేకుండా ముందుకు సాగుతున్నారు. దేశంలో కరోనా ప్రభావం రోజురోజుకూ పెరుగుతూనే వుంది. ఇప్పటికే బాధితుల సంఖ్య 3 లక్షలు దాటగా మరణించినవారి సంఖ్య పది వేలు పైబడింది. దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారింది. ఆహార కొరత ఏర్పడే అవకాశముందని ఐక్యరాజ్య సమితి సైతం హెచ్చరించింది. ఇలాంటి విపత్కర సమయంలో కేంద్ర సర్కారు పరిష్కార మార్గాలను పక్కన పెట్టి ఈ ఏడాది చివర్లో బీహార్, పశ్చిమ బంగలతో పాటు పలు రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికలపై దృష్టితో ముందుకు సాగుతున్నారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బిజెపి జాతీయ కార్యదర్శి రాం మాధవ్ తదితరులు వర్చువల్ ర్యాలీలను నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీలు కరోనా సమయంలో ప్రజలతో సన్నిహితంగా వుండటానికే అని చెబుతున్నప్పటికీ ఇటీవల బెంగాల్, బీహార్, ఒడిశాలలో షా చేసిన ప్రసంగాలు.. కార్యక్రమాలు అన్నీ ఎన్నికల దృష్టితోనూ వున్నాయని గ్రహించలేని జనం లేరు. ఇక ఆంధ్రప్రదేశ్ వర్చువల్ ర్యాలీలో రాం మాధవ్ ప్రసంగం తీరు జగన్ సర్కార్‌ను తిట్టిపోసేదిగా సాగింది. ఈ ఏడాది పాలనలోనూ కేంద్ర నిధుల నుండి ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించలేదు. ఇవేవీ చెప్పకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ఏడాది ఆదాయం గణనీయంగా తగ్గిందని నిందించడం కమల నాథులకు మాత్రమే చెల్లింది. ఇలా దేశ ప్రజలంతా కరోనా మహమ్మారితో పోరాడుతుండగా బిజెపి తన రాజకీయ క్రీడలను కొనసాగించడం దారుణం. కరోనా మహమ్మారి ముంచుకొస్తున్న తరుణంలో మధ్యప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలదోసి బిజెపి గద్దెనెక్కింది. లాక్‌డౌన్ ప్రకటనకు ముందు రోజునే శివరాజ్‌సింగ్ చౌహాన్ పట్టాభిషిక్తుడు కావడం గమనార్హం. అందుకోసమే లాక్‌డౌన్‌కు సంబంధించిన ముందస్తు సన్నద్ధతను కేంద్రం విస్మరించిందన్న విమర్శలు వారి చెవికెక్కడం లేదు. మహారాష్ట్రలో గవర్నర్‌ను ఉపయోగించుకుని అక్కడి ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన

ప్రయత్నాలు అందరికీ తెలిసినవే. మోడీ, అమిత్ షా సొంత రాష్ట్రం గుజరాత్ సహా వివిధ రాష్ట్రాల్లో కరోనా కేసులు, మరణాలు నానాటికి పెరిగిపోతున్నాయి. కానీ, వాటిని నియంత్రించడానికి, ప్రజలకు ఉపశమనం కలిగించడానికి అవసరమైన చర్యలను చేపట్టకుండా ఎన్నికల ప్రచారాలపై దృష్టి సారించడం రాజకీయ పార్టీల చిత్తశుద్ధిపై అనుమానం కలిగిస్తోంది. కరోనా కల్లోలం నేపథ్యంలో ప్రతి కుటుంబానికి నేరుగా నగదు, ఆహార ధాన్యాల పంపిణీ, ఉపాధి కల్పన, నిరుద్యోగ భృతి వంటివి వెంటనే విడుదల చేయాలన్న డిమాండ్ లను పక్కన పెట్టారు. బ్యాంకు రుణాలపై మారిటోరియం విధించినా వడ్డీ తడిసి మోపెడు అవుతున్నా పట్టించుకోవడం లేదు. కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు దీనిని కట్టడి చేయడానికి చేస్తున్న ప్రయత్నాలు ఇంకా పూర్తిస్థాయిలో ఫలించలేదు. ఇవి కొలిక్కి రావడానికి కనీసం మరో నాలుగైదు నెలల సమయం పడుతుందని కొందరు, అసలు ఔషధం తయారు చేయడమే సాధ్యం కాకపోవచ్చని మరికొందరు అంటున్నారు. ఏమైనప్పటికీ, కరోనాతో కలిసి కొంత కాలమైనా సహజీవనం చేయక తప్పదని తేలిపోయింది. వైరస్ విస్తృతిని, నివారణ కోసం అమలు చేస్తున్న లాక్‌డౌన్ ఆంక్షలను అవకాశంగా తీసుకుని నరేంద్ర మోడీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలకు పోతుండటమే ఆందోళనకరం. దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న ఆరోగ్య అత్యవసర పరిస్థితి నేపథ్యంలో మోడీ సర్కారు ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోంది. ఈ దుర్మార్గపు విధానాలపై ప్రజానీకం గొంతు విప్పుతున్నా, మరో మార్గం లేక నిరసనలకు దిగుతున్నా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఏ మాత్రం స్పందించడం లేదు. ఇది ప్రజలను వారి మానాన వారిని వదిలేసే చర్యలు తప్ప మరోటి కాదు. అధికారంలో ఉన్న పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోకుంటే ప్రజలు సమయం కోసం ఎదురుచూస్తారు.

## ప్రసూతి ఆస్పత్రిలో 32మందికి కరోనా

### -ఆందోళనలో ఆస్పత్రి సిబ్బంది

హైదరాబాద్,జూన్16త(ఆర్ఎన్ఎ): కరోనా పోరాటంలో ముందు వరుసలో ఉండే పోలీసు, వైద్య సిబ్బందిలో వైరస్ వ్యాప్తి కలకలం రేపుతోంది. సోమవారం జరిపిన పరీక్షల్లో పేట్ల బురుజు ప్రసూతి ఆస్పత్రిలో 32 మంది వైద్య సిబ్బందికి వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు తెలిసింది. వారిలో 18 మంది వైద్యులు, 14 మంది సిబ్బంది ఉన్నారు. కాగా, పూర్తిస్థాయి జాగ్రత్తలు, పీపీఈ కిట్లు ధరించినప్పటికీ వైద్య సిబ్బందికి కరోనా సోకవడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఉస్మానియా వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రులతో పాటు, నిమ్స్, కింగ్ కోఠి, గాంధీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో వైద్య సిబ్బంది వైరస్ బారినపడిన సంగతి తెలిసిందే. మరోవైపు ప్రభుత్వ యంత్రాంగంలో కీలకంగా వ్యవహరించే ప్రజా ప్రతినిధులూ కోవిడ్ బారినపడుతున్నారు. జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదిగిరి రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణెశిష్ గుప్తాకు పాజిటివ్‌గా తేలింది.

## త్రైపాక్షిక చర్చలపై భారత్ దృష్టి

### -పాల్గొననున్న విదేశాంగ మంత్రి జయశంకర్

న్యూఢిల్లీ,జూన్156(ఆర్ఎన్ఎ): భారత్ – రష్యా– చైనా మధ్య జూన్ 22న జరగబోయే త్రైపాక్షిక చర్చల్లో కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్ పాల్గొననున్నారు. భారత్, చైనా మధ్య నెలకొన్న సరిహద్దు విభేదాల నేపథ్యంలో ఈ చర్చలకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనుంది. ఈ సదస్సు మే నెలలో జరగాల్సి ఉండింది. కరోనా కారణంగా వాయిదా పడుతూ వచ్చింది.రష్యా ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో కోవిడ్ మహమ్మారి నియంత్రణతో పాటు, ఉమ్మడిగా ఎదుర్కొంటున్న భద్రతా సమస్యలపై మూడు దేశాల ప్రతినిధులు చర్చించనున్నారు. అయితే సాధారణంగా ఏ రెండు దేశాల మధ్య తలెత్తిన సమస్యలను కేవలం ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకుంటారు. మూడో దేశం జోక్యాన్ని సహించరు. ఈ కారణంగానే భారత్, చైనా మధ్య తలెత్తిన వివాదం ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చే అవకాశమే లేదని అధికారులు పేర్కొన్నారు. మూడు దేశాలూ కలిసి ప్రాంతీయ అంశాలు చర్చించుకోడానికి చక్కని అవకాశం దొరికింది. ప్రాంతీయ స్థిరత్వానికి కూడా ఈ సదస్సు దోహదం చేస్తుందని అధికారులు తెలిపారు. అయితే భారత చైనా మధ్య తలెత్తిన సరిహద్దు సమస్యపై రష్యా ఇప్పటికే ఓ ప్రకటన చేసింది. ప్రాంతీయ స్థిరత్వాన్ని దృష్టిలో పెట్టుకుని ఇరు దేశాలు కూడా చర్చల ద్వారా సమస్యను పరిష్కారం చేసుకోవాలని రష్యా అభిప్రాయపడింది.

## వరంగల్ ఎంజిఎంలో ఆరుగురికి కరోనా

వరంగల్,జూన్16(ఆర్ఎన్ఎ): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో సోమవారం ఆరుగురికి కరోనా పాజిటీవ్ వచ్చినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. ఆదివారం దవాఖానలో చేరిన 13 మందికి కరోనా టెస్టులు నిర్వహించగా 6గురికి పాజిటీవ్ రిపోర్టు వచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఇందులో ఈ నెల 6న బ్రాహ్మణవాడలో ఓ టీచర్‌కు కరోనా పాజిటీవ్ రాగా.. అతని భార్య, కూతురికి కరోనా నిర్ధారణ అయినట్లు తెలిపారు. కాజీపేట విష్ణుపురికి చెందిన భార్యాభర్తలిద్దరికీ పాజిటీవ్ రాగా.. వారు వారం రోజులు హైదరాబాద్‌లో ఉండి ఆదివారం వరంగల్ ఎంజీఎంలో చేరారు. జనగామ జిల్లాకు చెందిన 37ఏళ్ల మహిళలకు పాజిటీవ్ రాగా, ఎమ్మెల్యే గన్‌మెన్‌కు రెండో సారి నిర్వహించిన పరీక్షలో పాజిటీవ్ వచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనతో వైద్య సిబ్బందిలో ఆందోళన నెలకొంది.

## కరోనా భయంతో ఆస్పత్రిలో చేరిన ఢిల్లీ మంత్రి

### -నెగెటివ్ రిపోర్ట్ రావడంతో ఊపిరి పీల్చుకున్న ఆప్

న్యూఢిల్లీ,జూన్16(ఆర్ఎన్ఎ): ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యేందర్ జైన్‌కు కరోనా నెగిటివ్ వచ్చింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ జ్వరంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి నుంచి జ్వరం, శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతున్న సత్యేందర్ జైన్.. ఢిల్లీలోని రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరారు. మంగళవారం ఉదయం ఆయన నుంచి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలు నిర్వహించగా, కరోనా నెగెటివ్ నిర్ధారణ అయింది. దీంతో ఆయన కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఆరోగ్య శాఖ మంత్రి త్వరగా కోలుకోవాలని సీఎం అరవింద్ కేజీవ్రాల్ ప్రార్థించారు. గత వారం సీఎం అరవింద్ కేజీవ్రాల్‌కు కూడా జ్వరం, గొంతు నొప్పి రావడంతో.. కరోనా టెస్టులు చేయించుకున్న విషయం విదితమే. కానీ కేజీవ్రాల్‌కు కరోనా నెగిటివ్ వచ్చింది. అయితే నిన్న ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి సత్యేందర్ జైన్ హాజరయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, సీఎం కేజీవ్రాల్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మధిర రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి

### ఎంపి నామా లేఖకు స్పందించిన రైల్వే శాఖ

ఖమ్మం,జూన్16(ఆర్ఎన్ఎ): ఖమ్మం జిల్లా మధిర పట్టణ చిరకాల కోరిక అయిన రైల్వే అండర్ బ్రిడ్జ్ కల నెరవేరబోతున్నది. దీనికి రైల్వే శృఖ అనుమతిస్తూ పార్లమెంటు సభ్యుడు నామ నాగేశ్వరరావుకు సమాచారం ఇచ్చింది. ఎంపి నామాతో ఈ సమస్య నెరవేరనుంది. పట్టణంలో మూసివేసి ఉంచిన రైల్వే గేటు వద్ద నూతన రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణాన్నికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మధిర పట్టణంలో ఎన్నో ఏళ్లుగా నూతన రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో...తెరాస లోక్ సభపక్ష నేత నామ నాగేశ్వరరావును జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, మధిర మున్సిపల్ నూతన కార్యవర్గ సభ్యులు, మధిర పట్టణానికి చెందిన బార్ అసోసియేషన్ సభ్యులు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. తక్షణమే స్పందించిన నామ... కేంద్ర రైల్వే శాఖ మంత్రి, రైల్వే జీఎం లకు లేఖలు రాశారు. వెంటనే... ప్రత్యేకంగా ఫోన్‌లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించి మధిర మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 30 వేల మందికి పైగా జనాభా ఉన్నారని ,అలానే ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రలకు సరిహద్దుగా మధిర పట్టణం ఉండడంతో నిత్యం జనం మధిర వస్తుంటారని వివరించారు. మధిర నడిబొడ్డున రైల్వే గేటు మూసివేసి ఉండడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మూసివేసి ఉంచిన రైల్వే గేటు వద్ద నూతన అండర్ బ్రిడ్జ్ నిర్మాణం చేయాలని కోరారు. దీంతో... నూతన రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టేందుకు సానుకూలత వ్యక్తం చేస్తూ ఎంపీ నామ క్యాంప్ కార్యాలయానికి కేంద్రం సమాచారమిచ్చింది.

# సీజనల్ వ్యాధులు దాడులు చేసే సమయం

### జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

### మంత్రి కేటీఆర్ ఆదేశాలతో పారిశుద్ధ్య పనులు

హైదరాబాద్,జూన్16(ఆర్ఎన్ఎ): కరోనా భయానికి తోడు ఈ వానకాలం సీజనల్ వ్యాధులు మరింతగా భయపెడుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విరేచనాలు వంటి వ్యాధులు విశ్వరూపాన్ని చూపించేందుకు గ్రామాలు, బస్తీలు, అపరిశుభ్ర ప్రాంతాల్లో తిష్ఠవేస్తాయి. ఈ సమయంలో పరిశుభ్రత పాటించకుంటే మనలను పీక్కుతుంటాయి. సీజనల్ వ్యాధులకు మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే ప్రధానమని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు పట్టణాలు, పల్లెలు, నగరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడుతున్నారు. వానకాలంలో నీరు నిలువకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. ముఖ్యంగా డెంగీ, చికున్‌గున్యా ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. డెంగీ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలు,మండలాలు, పట్టణాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు.జ్వరం సర్వే, పెరిడోమేస్టిక్ లార్వల్ సర్వే, యాంటీ లార్వల్ సర్వే, పేరిత్రల్ స్ప్రే, యాంటి లార్వల్ ఆపరేషన్, అవగాహన సదస్సులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ప్రతి ఆదివారం పది గంటలకు పది నిమిషాలు ఎవరింట్లో వారు స్వచ్ఛ కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఇందులో పాల్గొంటున్నారు.

వర్షాకాలంలో మలేరియా విజృంభిస్తుంది. జ్వరం వచ్చి తగ్గుతుండడం, చలి, శరీరంలో నొప్పులు, తలనొప్పి లక్షణాలతో ప్రారంభమవుతుంది. ఇండ్లల్లో దోమ తెరలు వాడాలి. పరిసరాల్లో చిన్నచిన్న గుంతల్లో నీళ్లు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇండ్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో డీడీటీ లాంటి పౌడర్‌ను చల్లడం అవసరం.

చికెన్ గున్యా కూడా దోమ వల్ల వస్తుంది. కండరాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ దోమ మంచి నీటిలో పెరుగుతుంది. ఇంట్లో పూల కుండీలు, కూలర్లలో ఎప్పటికప్పుడు నీటిని మారుస్తుండాలి. ఈ సీజన్‌లో సాధ్యమైనంత ఎక్కువగా కాచి చల్లార్చి వడబోసిన నీటిని లేదా క్లోరిన్ కలిపిన నీటిని మాత్రమే తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తినాలి. వ్యక్తిగత పరిశుభ్రత తప్పని సరిగా పాటించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

# కరోనా ఆందోళనలో వైద్య సిబ్బంది

### చికిత్సలు చేసే సమయంలో అంటుకుంటున్న వైరస్

హైదరాబాద్,జూన్16(ఆర్ఎన్ఎ): అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో కూడిన నిమ్స్ తదితర ఆస్పత్రుల్లో కరోనా వైరస్ కారణంగా వైద్య సిబ్బంది ఆందోళనలకు గురవుతోంది. దాదాపుగా అనేక ఆస్పత్రుల్లోని వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఉద్యోగులు వైరస్ బారినపడుతున్నారు. ఇప్పటికే కరోనా వైరస్ లక్షణాలు బయటపడగా మరికొంత మందికి ఎలాంటి లక్షణాలు లేకుండానే కరోనా సోకినట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రధానంగా జంటనగరాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది, పోలీసులు, జర్నలిస్టులు ఇలా అంతా వైరస్ బారిన పడి ఆందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నిమ్స్‌లోని ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్నారు. వీరిలో చాలా వరకు వైరస్ ప్రభావం తీవ్రత తగ్గుముఖం పట్టడంతో హోం క్వారంటైన్‌కు వెళ్లారు. ఈ పరిణామాల నేపథ్యంలో క్యాథ్‌లాబ్, కార్డియాలజీ, నెఫ్రాలజీ విభాగాలకు వచ్చిన రోగుల ద్వారానే వైరస్ సోకినట్లు నిమ్స్ వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. 75 శాతం మేరకు కరోనా లక్షణాలతో బాధపడుతున్నట్టు ఆయా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో ప్రతి ఒక్కరికి వైరస్ సోకే ప్రమాదం లేకపోలేదని, ఆ దిశగా తగిన జాగ్రత్తలు తీసుకోవడం మినహా చేయగలిగినదేమీ లేదని ఓ జూనియర్ డాక్టర్ పేర్కొన్నారు. ఏది ఏమైనా వైరస్ కారణంగా మరణాలు లేకపోవడం గమనార్హం. పాజిటివ్‌గా నమోదైన వైద్యులు, పారామెడికల్ సిబ్బందిలో చాలా వరకు ఆస్పత్రి ఐసోలేషన్ వార్డు నుంచి హోం క్వారంటైన్‌కు వెళుతున్నారు. కానీ వైద్యులు సైతం భయం భయంగానే వైద్య సేవలందిస్తున్నారని ఓ ఉద్యోగి పేర్కొన్నారు. మరోపక్క ఆపరేషన్ థియేటర్లలో కూడా వైరస్ వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదని ఓ సీనియర్ వైద్యుడు పేర్కొన్నారు. ఏదైనా ఆపరేషన్ జరిగిన సందర్భంగా అక్కడున్న వైద్యులంతా కలిసి ఒకే చోట భోజనం చేయడం పరిపాటి. ఆ సమయంలో మాస్కులు ఉండవు. దాని వల్ల కూడా వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం లేకపోలేదంటున్నారు. దీంతో వెద్యులందరికి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కరోనా పరీక్షలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నట్టు పేర్కొన్నారు. వైద్యులతో పాటుగా పారామెడికల్ సిబ్బంది, ఉద్యోగులకు సైతం ప్రాధాన్యతా క్రమంలో పరీక్షలు నిర్వహించాలన్న యోచనలో యాజమాన్యం ఉన్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే శస్త్ర చికిత్సలను నిలిపివేయాలని యాజమాన్యం సూచించింది. నిమ్స్ ఆస్పత్రిలో ప్రస్తుతం 150 మంది వైద్యులు ఉండగా వీరిలో దాదాపు 25 మందికి పాజిటివ్‌గా నమోదైనట్టు తెలుస్తోంది. అలాగే పారామెడికల్ సిబ్బంది 200 మంది ఉండగా వీరిలో 20మందికి పైగా వైరస్ సోకినట్లు సమాచారం. కాంట్రాక్టు సిబ్బంది 400మందిలో 25 శాతం మేరకు హోం క్వారంటైన్‌లో ఉన్నట్టు తెలుస్తోంది.

# హాలియాలో పేకాట రాయుళ్ల అరెస్ట్




నల్లగొండ, జూన్ 16త: జిల్లాలోని హాలియాలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు, సెల్ ఫోన్స్, బైకులు కూడా స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ జే.శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో హాలియా పట్టణంలోని సాగర్ రోడ్డులో గల బాలాజీ ఇంజినీరింగ్ అండ్ రోలింగ్ షట్టర్ షాపులో పేకాట అడుతున్నట్లు సమాచారం అందింది. తమ సిబ్బందితో కలిసి అక్కడ తనిఖీలు చేయగా ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 48,600/- రూపాయల నగదు, 6 సెల్ ఫోన్స్, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# హరితహారంలో 50లక్షల మొక్కలు

హైదరాబాద్,జూన్16(ఆర్ఎన్ఎ): ఆరో విడత హరితహారంలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలో 50 లక్షల మొక్కలు నాటుతామని జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ తెలిపారు. నగరంలోని అన్ని నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇదే విషయమై సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సూరారం, మాదన్నగూడ, నాదర్‌గుల్‌లో అర్బన్ ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. కాలనీ, అపార్ట్‌మెంట్ వాసులు కూడా ఈ ఏడాది పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కమిషనర్ పిలుపునిచ్చారు. హరిత హైదరాబాద్‌గా మార్చి.. కాలుష్యం లేకుండా చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతాయుతంగా మొక్కలు నాటాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ప్రకృతిని మనం కాపాడితే.. మనల్ని ప్రకృతి కాపాడాతుందని అన్నారు.

## చైనాతో ముప్పు రాకుండా చూస్తున్నాం: ట్రంప్

వాషింగ్టన్,జూన్16(ఆర్ఎన్ఎ): చైనాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డాడు. ఇతర దేశాలతో చేసుకున్న ఒప్పందాలను డ్రాగన్ ఉల్లంఘిస్తూనే ఉందని ధ్వజమెత్తారు. చైనాతో పారదర్శక, వాస్తవిక సంబంధాలనే అమెరికా కోరుకుంటోందని, అయితే వీటికోసం తీసుకునే చర్యల సమయంలోనే చైనా నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా జాతీయ విధానాలకు చైనా వల్ల ముప్పు వాటిల్లకుండా చూసుకోవడంలో యూఎస్ తలమునకలవుతోందన్నారు. ఇలాంటి సమయంలో కూడా చైనాతో సత్సంబంధాలనే అమెరికా కోరుకుంటోందని స్పష్టంచేశారు.

## విమానాల్లో ఫేస్ మాస్కులు తప్పనిసరి

### అమెరికా ఎయిర్‌లైన్స్ నిర్ణయం

వాషింగ్టన్,జూన్16(ఆర్ఎన్ఎ): ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో ఫేస్ మాస్కులు ధరించని ప్రయాణికులను విమానాల్లో ప్రయాణానికి అనుమతించమని అమెరికా విమానయాన సంస్థలు ప్రకటించాయి. విమానాల్లో ఫేస్ మాస్కులు ధరించని ప్రయాణికులను ఇకనుంచి న్గో÷÷-ల జాబితాలో చేర్చాలని అమెరికా దేశానికి చెందిన అలస్కా ఎయిర్‌లైన్స్, అమెరికన్ ఎయిర్‌లైన్స్, డెల్టా ఎయిర్ లైన్స్, హవాయిన్ ఎయిర్‌లైన్స్, జెట్‌బ్లూ ఎయిర్‌వేస్, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ నిర్ణయించాయి. ప్రయాణికులు తినేటపుడు, మంచినీరు తాగేటపుడు మాత్రం మినహాయింపులు ఇచ్చారు. ప్రయాణికులు విమానం ఎక్కేముందే ఫేస్ మాస్క్ లు ధరిస్తామని అంగీకారం తెలపాల్సి ఉంటుందని విమానయాన సంస్థలు చెప్పాయి.

## చాపకింద నీరులా కరోనా: ఎమ్మెల్యే

జనగామ,జూన్16(ఆర్ఎన్ఎ): చాపకింద నీరులా విజృంభిస్తున్న కరోనాను వ్యక్తిగత పరిశుభ్రతతోనే కట్టడి చేయవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ టీ రాజయ్య అన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి కరోనా పాజిటివ్‌గా తేలడంతో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటున్న ప్రజాప్రతినిధులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజలు కూడా వ్యక్తిగత రోణ తీసుకోకుంటే కరోనా వెంటాడుతుందని హెచ్చరించారు.

వృద్ధులకు మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేశారు. కరోనా మహమ్మారి నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత, మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటిస్తే వైరస్ దరి చేరదన్నారు. లాక్‌డౌన్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కరోనా కట్టడికి పోలీసు, రెవెన్యూ, వైద్య, పారిశుద్ధ్య సిబ్బంది, జర్నలిస్టులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రాణాలను లెక్క చేయకుండా కృషి చేయడం హర్షణీయమన్నారు.

## రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ

### ఆరేళ్లలో 367 శాతం పెరిగిన ధాన్యం కొనుగోళ్లు

### గతేడాది యాసంగి కంటే 76 శాతం అధికం

### పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,జూన్16(ఆర్ఎన్ఎ): ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం రికార్డు సృష్టించిందని, ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కోటి 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి.. సరికొత్త రికార్డు నెలకొల్పామని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా అవతరించబోతోందని శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావించిన ఏడాది 2014-15లో వానాకాలం, యాసంగిలో కలిపి కేవలం 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా.. ఇప్పుడేమో కోటి 12 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి, పట్టుదల, ముందుచూపు వల్లే ఇది సాధ్యమైందన్నారు. సిఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా అవతరించబోతోందని శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ముగిసిన సందర్భంగా మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2019-20 ఏడాదిలో చరిత్రలో అత్యధికంగా రికార్డు స్థాయిలో వానాకాలంలో 47 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగిలో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కేవలం ఆరు సంవత్సరాల్లోనే 367 శాతం ధాన్యం కొనుగోళ్లు పెరిగాయన్నారు. గత యాసంగి కంటే ఈ ఏడాదిలో 28 లక్షల(76 శాతం) మెట్రిక్ టన్నులు అధికంగా కొనుగోలు చేసినట్లు శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. యాసంగిలో 6,408 కొనుగోలు కేంద్రాల ద్వారా 9.68 లక్షల మంది రైతుల నుంచి దాదాపు రూ. 12 వేల కోట్ల విలువ చేసే 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకు రూ. 11 వేల కోట్లను రైతుల ఖాతాలో జమ చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ యాసంగిలో 39 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు అయినట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ చేపట్టిన రైతు సంక్షేమ చర్యలు, రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ వల్లే సాధ్యమైందన్నారు. కరోనా లాక్‌డౌన్ కాలంలోనూ రైతాంగానికి ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు విజయవంతంగా జరిపించినట్లు మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, గంగుల కమలాకర్, సీఎస్ సోమేశ్ కుమార్‌కు శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## జీవితంపై విరక్తితో విఆర్వో ఆత్మహత్య

నిజామాబాద్,జూన్16(ఆర్ఎన్ఎ): గ్రామ రెవెన్యూ కార్యదర్శి ఆత్మహత్య చేసుకోవడం జిల్లాలో కలకలం సృష్టించింది. కోటగిరి మండలం కొడిచర్ల గ్రామ రెవెన్యూ కార్యదర్శి కృష్ణారెడ్డి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రుద్రూర్ మండల కేంద్రంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళితే.. ఆదివారం రాత్రి 2 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్తున్నానని చెప్పి బయలు దేరాడు. అలా వెళ్లిన కృష్ణా రెడ్డి.. రుద్రూర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం చెరువులో అతని మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్య వివరాలను మృతుని కుటుంబ సభ్యులకు చేరవేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. జీవితంపై విరక్తి చెందడం వల్లే ఆత్మహత్యకు పాల్పడటానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

## కరోనా కట్టడిలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శం

### -వలంటీర్ వ్యవస్థతో మంచి ఫలితాలు

అమరావతి,జూన్16(ఆర్ఎన్ఎ): ప్రపంచం మొత్తాన్ని కబళించడానికి సిద్ధపడుతున్న కరోనా వైరస్‌పై అన్ని రకాలుగా పోరాడటం పరిస్థితుల్లో అత్యంత కీలకమైన దశలో ఉన్నాం. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, భౌతిక దూరం పాటించాల్సిన సమయం ఇది. లాక్‌డౌన్ సడలింపులతో ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తే నష్టపోయేది అంతిమంగా ప్రజలేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన దేశంలో కరోనా కట్టడిలో ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలిచింది. గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థ, గ్రామ సచివాలయాలు అద్భుతమైన ఫలితాలిస్తున్నాయి. ఈ రెండు వ్యవస్థలూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది వగైరాలతో సమన్వయం చేసుకుంటూ తాము సేకరిస్తున్న సమాచారాన్ని యాప్‌ల ద్వారా అమరావతిలోని వైద్య ఆరోగ్య శాఖకు చేరేస్తున్నాయి. వివిధ మాధ్యమాల ద్వారా కరోనా మహమ్మారితో వచ్చిపడిన ప్రమాదం గురించి తెలుసుకోవడం వేరు... ప్రత్యక్షంగా తమ ముంగిట్లో కొచ్చినవారు చెప్పేది వినడం వేరు. చేతులు పరిశుభ్రం చేసుకోవడం దగ్గరనుంచి ఇతరత్రా పాటించాల్సిన నియమాల వరకూ వారు బోధిస్తుంటే పౌరుల్లో అవగాహన పెరుగుతోంది. వైద్య సాయం అవసరమున్న వివిధ వ్యాధిగ్రస్తులకు, గర్భిణిలకు సమస్యలెదురుకాకుండా వారి ఇళ్లవద్దే మందులు, పౌష్టికాహారం వంటివి అందజేస్తున్నారు. తమ ఇరుగుపొరుగులో విదేశాలనుంచి వచ్చినవారుంటే సమాచారం అందించే చైతన్యాన్ని ప్రజలకు కలిగిస్తున్నారు. కొన్ని దేశాల్లో అయితే ఆ వైరస్‌ను అంతం చేయడం మాట అటుంచి కనీసం కట్టడి చేయడంలోనూ విఫలం అవుతున్నారు. అమెరికాలో లాక్‌డౌన్‌ను పట్టించుకోకుండా సముద్ర తీరాల్లో సంబరాలు చేసుకోవడం వల్లనే వ్యాధి వ్యాప్తి చెందిందని విమర్శలు వచ్చాయి. ఈ మహమ్మారి పెనువేగంతో ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తోంది. వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో వైరస్ నియంత్రణలో అమల్లోకి తెచ్చిన చర్యలను అధ్యయనం చేయడం అవసరం. అలాగే కరోనా తీవ్రత అంతగాలేని దేశాల విధానాలనుంచి కూడా నేర్చుకోవాల్సింది వుంటుంది. దక్షిణ కొరియా కూడా కరోనాను అదుపు చేయడం మెరుగైన విజయం సాధించింది. అంతర్జాతీయ విమానాల రాకపోకలను రద్దుచేసిన ఆవ్యాధి విస్తరణ ఆగలేదు. అనుమానిత కేసులు వెంటవెంటనే ఆరా తీయడం, అందులో వాస్తవంగా కరోనా కేసులెన్నో నిర్ధారించడం ప్రారంభించినా మనదేశంలో వ్యాప్తి తీ÷-రవంగానే ఉంది. ఈ దశలో భారీగా జనం పాల్గొనే అవకాశమున్న సమావేశాలను, ఉత్సవాలను ఎవరికి వారు స్వచ్ఛందంగా నిలిపేయాల్సి ఉంది. నిర్మాణ రంగం, మరికొన్ని ఇతర రంగాల్లో పనిచేస్తున్న వేరే రాష్ట్రాల కార్మికులు గత్యంతరం లేక నడక దారిన స్వస్థలాలకు పోవడం, ఇతర ప్రాంతాల్లో ఉన్న ఎపి వారు రావడంతో మళ్లీ వ్యాప్తి పెరిగింది. ఇప్పటికే గత ఐదారు నెలలుగా అన్ని దేశాలూ, రాష్ట్రాలు తమకు చేతనైన రీతిలో పోరాడుతున్నాయి. ఇతరుల అనుభవాలను గ్రహించి ఆ పోరాటాన్ని మరింత పదునెక్కిస్తున్నాయి. ఇలాంటి సమష్టి పోరాటాలే ఈ మహమ్మారిని త్వరగా అంత మొందించగలవు. ఇందుకు పౌరుల సహాయసహకారాలు అత్యవసరం. వారు ఎంతగా కఠినంగా ఉంటే అంతగా వ్యాప్తిని అరికట్టవచ్చని హెచ్చరిస్తున్నారు.

## కరోనా కట్టడికి చర్యలు: కోన రఘుపతి

గుంటూరు,జూన్16(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అన్నారు. మంగళవారం నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కావడంతో కరోనా వ్యాప్తిని కట్టడి చేసేందుకు ముందస్తు చర్యలలో భాగంగా సోమవారం నగరంపాలెంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కరోనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ఎక్కువ కరోనా పరీక్షలు నిర్వహించారని చెప్పారు.

## బిల్లుల కోసమే అసెంబ్లీ సమావేశాలు: చినరాజప్ప

అమరావతి,జూన్16(ఆర్ఎన్ఎ): ప్రజా సమస్యలను గాలికొదిలి.. వారి సొంత బిల్లుల ఆమోదం కోసం ఈ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్టుగా ఉందని మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. అయినా తమ ధర్మం ప్రకారం హాజరై నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. అసెంబ్లీలో ఎవరూ ప్రశ్నించకూడదనే అచ్చెంనాయుడిని అరెస్టు చేశారన్నారు. ఉద్దేశపూర్వకంగా ఆయన్ను తిప్పుతూ ఇబ్బందులు పెట్టారన్నారు. ఏడాది పాలనలో అభివృద్ధి అనేది లేదని వారే అంగీకరించారన్నారు. నవరత్నాల పేరుతో కొత్త రకం అవినీతి చేస్తున్నారన్నారు. యనమల, తాను పెళ్లికి వెళితే.. తమపై కేసులు పెట్టారన్నారు. ఆ పెళ్లి సరికాదంటే పోలీసులు ముందే చర్యలు తీసుకోవాలని చినరాజప్ప పేర్కొన్నారు. అతిథులుగా వెళితే... అన్యాయంగా కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. టీడీపీ ప్రజా ప్రతినిధుల నోరు నొక్కడానికే ఈ అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు.

## మీడియా సమావేశంలో దౌర్జన్యమా?

### హిందూపురం ఎంపి మాధవ్ తీరు సరికాదు

### మండిపడ్డ టిడిపి నేతలు

అనంతపురం,జూన్16(ఆర్ఎన్ఎ): వైసీపీ నేతల మీడియా సమావేశం అంటేనే పాత్రికేయ మిత్రులు భయపడే పరిస్థితి ఏర్పడిందని టీడీపీ నేత, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు విమర్శించారు. మంగళవారం హిందూపురంలో వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ మీడియా సమావేశంలో వైసీపీ నేతలు రౌడీయిజం చేశారని మండిపడ్డారు. మీడియా మిత్రులపై ఇలాగేనా ప్రవర్తించేదని అన్నారు. ప్రశ్నలు అడగొద్దంటూ విలేకర్లతో వాగ్వాదానికి దిగడం ఎంతవరకు సబబని అన్నారు. ఈ సందర్భంగా దాడికి కూడా ప్రయత్నించారని అన్నారు. దీనిపై స్పందించిన కాల్వ ఏబీఎన్ ప్రతినిధిపై వైసీపీ నేతలు రౌడీయిజం చేయడం దుర్మార్గమన్నారు. ఒకవైపు ప్రతిపక్షాలను భయపెడుతూ, బెదిరిస్తూ అక్రమ కేసులు పెట్టడం, అరెస్టుల చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. చివరికి జర్నలిస్టులు కూడా బాధితులుగా మారిపోతున్నారని కాల్వ శ్రీనివాసులు అన్నారు. మీడియా సమావేశంలో విలేకరులకు రక్షణ లేకపోవడం విచారకరమని అన్నారు. వైసీపీ నేతలు దౌర్జన్యపూరితమైన చర్యలు పాల్పడుతున్నారో అర్థమవుతోందని అన్నారు. ఇలాంటి చర్యలకు అధికారపార్టీ నాయకులే ఉసిగొల్పోతుందన్నారని ఆరోపించారు. ఇది అధికారపార్టీ దౌర్జన్యమని, దీన్ని అందరూ తీవ్రంగా ఖండించాలని కాల్వ శ్రీనివాసులు అన్నారు.

టీడీపీ నేత జెసి పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇది రావణ కాష్టంలా ఉంది.. పరిపాలనలా లేదని విమర్శించారు. నాయకులు ఎలా ఉంటారో.. వారి కిందవారు కూడా అలాగే ఉంటారన్నారు. ఎక్కడ ప్రెస్ మీట్ జరిగిన మీడియా ప్రతినిధులు వస్తారని, నాయకులు చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నలు వేయడం సహజమన్నారు. సాక్షి పేపర్, చానల్ మొత్తం వైసీపీదేనని, వాళ్లపై ఎప్పుడు ఇలా దాడులు జరగలేదని పవన్ కుమార్ రెడ్డి అన్నారు. మరి ఈ సంస్కృతి ఏంటో అర్థం కావడంలేన్నారు. ఏబీఎన్ అనేది ఒక పార్టీకి చెందినది కాదని, అన్ని పార్టీలకు చెందిన వాళ్ల గురించి చూపిస్తారని, ఇంత దౌర్జన్యం ఎప్పుడూ చూడలేదన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రతిపక్షం, వ్యవస్థలు, మీడియా అంటే గౌరవం లేదని, వైసీపీ నేతలు సహనం కోల్పోతున్నారని విమర్శించారు. వాళ్లే తప్పు చేసి తిరిగి మనపై కేసులు పెట్టే పరిస్థితి రాష్ట్రంలో ఉందని పవన్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## వీడియో మార్ఫింగ్‌తో ట్విట్టర్‌లో షేర్

### -దిగ్విజయ్ సింగ్‌పై పోలీస్ కేసు

భోపాల్,జూన్16(ఆర్ఎన్ఎ): ఓ మార్ఫింగ్ వీడియోను ట్విటర్‌లో షేర్ చేసినందుకు గాను కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌పై మధ్యప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వీడియోలో ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మద్యపానాన్ని ప్రోత్సహిస్తున్నట్లుగా దిగ్విజయ్ మార్ఫింగ్ చేశారని భాజపా ఆరోపించింది. కాంగ్రెస్ హయాంలో మద్యం విధానంపై శివరాజ్ సింగ్ మాట్లాడిన మాటల్ని దిగ్విజయ్ సింగ్ తారుమారు చేశారని భాజపా నేత, మాజీ హోంమంత్రి ఉమాశంకర్ గుప్తా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్వీట్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను, ఇతర ఆధారాలను ఆయన క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు అందజేశారు. ముఖ్యమంత్రి వ్యక్తిత్వాన్ని కించపరిచే ఉద్దేశంతోనే దిగ్విజయ్ సింగ్ ఆ వీడియో షేర్ చేశారని ఉమాశంకర్ ఆరోపించారు. ఫిర్యాదుపై క్రైమ్ బ్రాంచ్ అధికారి నిశ్చల్ ఝూరియా మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్ని పర్యవేక్షించే సైబర్ విభాగం దిగ్విజయ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని చెప్పారు. దిగ్విజయ్ సింగ్‌ను ఫోర్జరీ, పరువునష్టం కేసుల్లో నిందితుడిగా చేర్చామని తెలిపారు. అమర్యాదకర వ్యాఖ్యలు జోడించి రీట్వీట్ చేసిన మరో 11 మందిపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. అయితే రాజకీయ కక్షతోనే ప్రభుత్వం తనపై కేసు నమోదు చేసిందని దిగ్విజయ్ విమర్శించారు. గిరిజనుల సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నందునే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆక్షేపించారు. అసలు వీడియోను ఎవరు మార్ఫింగ్ చేశారో కూడా దర్యాప్తు చేయాలని ప్రభుత్వానికి సూచించారు.త

# ఎపి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

**ఆర్థికంగా పురోగమిస్తూనే అభివృద్ధిలో దూకుడు**
**అనేక సంక్షేమ పథకాల అమలుతో ప్రజల్లో సంతోషం**
**రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా సుమారు రూ.2,200 కోట్లు ఆదా**
**వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 8శాతం వృద్ధిరేటు**
**గత ఏడాది కంటే తలసరి ఆదాయం 12 శాతం పెరుగుదల**
**కరోనా కట్టడికి రోజుకు 15వేలు పరీక్షలు ...**
**తఇప్పటికే 5.5 లక్షల టెస్టులు పూర్తి**
**మూడేళ్లలో 48వేల పాఠశాలలను ఆధునీకరిస్తాం**
**రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో మారనున్న దశ**
**ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ వీడియో ప్రసంగం**

అమరావతి,జూన్16(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థికంగా పురోగమిస్తూనే...అభివృద్ధిలో దూసుకుని పోతోందని ఎపి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఏపీ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాలు సందర్భంగా మంగళవారం ఆయన రాజ్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. గడిచిన ఏడాది కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని గవర్నర్ బిశ్వభూషన్ పేర్కొన్నారు. గడిచిన ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. విద్యా, వైద్యం ఆరోగ్యం రంగాల్లో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని కితాబిచ్చారు. ప్రభుత్వం స్వచ్ఛమైన, అవినీతిరహితమైన పాలనకు కట్టుబడి ఉందని, రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా సుమారు రూ.2,200 కోట్లు ఆదా చేశామని గుర్తుచేశారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో 8.16 శాతం వృద్ధి రేటు సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 8శాతం వృద్ధి రేటు సాధించామని వెల్లడించారు. పారిశ్రామిక రంగంలో 5శాతం వృద్ధిరేటు నమోదు అయ్యిందని పేర్కొన్నారు.



గత ఏడాది కంటే తలసరి ఆదాయం 12 శాతం పెరిగిందన్నారు. కరోనా కట్టడికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని గవర్నర్ తెలిపారు. రోజుకు 15వేలు పరీక్షలు చేస్తున్నారని, ఇప్పటికే 5.5 లక్షల టెస్టులు చేసినట్లు చెప్పారు. జాతీయ సగటు కంటే ఏపీలో రికవరి రేటు అధికమని బిశ్వభూషణ్ హరిచందన్ తెలిపారు. ఎన్నికల హామీలో ఇవ్వని 40 పథకాలను సైతం విజయవంతగా అమలు చేస్తున్నారు. ఈ ఏడాదిలో వివిధ పథకాల కింద 3.98 కోట్ల మంది ప్రజలు లబ్ది పొందారు. దీని కోసం రూ.42వేల కోట్లు ఖర్చు చేశాం. గత ఏడాదితో పోలిస్తే తలసరి ఆదాయం 12శాతం వృద్ధి సాధించాం. 129 హామీల్లో 77 హామీలు నెరవేర్చారు. 39 హామీలు పరిశీలనలో ఉన్నాయి. మేనిఫెస్టోలో లేని 40 హామీలను కూడా నెరవేర్చడం జరిగింది. పిల్లల చదువు, తల్లుల సంక్షేమం కోసం అమ్మఒడి పథకాన్ని ప్రారంభించాం. నాడు-నేడు మనబడి కార్యక్రమం కింద.. మూడేళ్లలో 48వేల పాఠశాలలను ఆధునీకరిస్తాం. ఆరోగ్యశ్రీ పథకం కింద 6.25 లక్షల మందికి లబ్ది చేకూరింది. దీని కోసం రూ.1534 కోట్లు ఖర్చు చేశాం. విద్యార్థులకు పౌష్టికాహారం కోసం జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తున్నాం. దీనికోసం 1105 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. జగనన్న వసతి దీవెన కింద 18.51 లక్షల మందికి లబ్ది చేకూరింది. దీనికోసం 3857 కోట్లు ఖర్చు చేశాం. వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా కింద 1.06 లక్షల మంది పొందారు. దీని కోసం రూ.72.82

కోట్లు ఖర్చు చేశాం. వైఎస్ఆర్ కంటివెలుగు కింద 67.69 లక్షల మందికి లబ్ది.. దీని కోసం 53.85 కోట్లు ఖర్చు పెట్టాం. గ్రామ సచివాలయాల్లో 12వేల వైఎస్ఆర్ క్లినిక్‌లు ఏర్పాటు చేసేందుకు.. ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రజా ఆరోగ్యంలో భాగంగా 1060 కొత్త 108, 104 వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. నాడు-నేడు కింద ఆస్పత్రులను ఆధునీకరించేందుకు రూ.15337 కోట్లు కేటాయించాం. వైఎస్ఆర్ రైతు భరోసా పథకం మొదటి దశ పూర్తయింది, రూ.12500 ఇస్తామని చెప్పినప్పటికీ.. దీన్ని రూ.13500లకు పెంచాం. మొదటి దశలో 49.44 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుస్తూ.. రూ.10,209.32 కోట్లు ఖర్చు చేశామని గవర్నర్ పేర్కొన్నారు.

రైతుభరోసా కేంద్రాల ఏర్పాటు

కౌలు రైతులకు కూడా ప్రయోజనం కల్పిస్తూ చర్యలు చేపట్టాం. ప్రతి గ్రామ సచివాలయంలోనూ రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశాం. వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి నియోజకవర్గస్థాయిలో 147 వైఎస్ఆర్ వ్యవసాయ ప్రయోగశాలలను ఏర్పాటు చేశాం. జిల్లాస్థాయిలో 13 ల్యాబ్‌లను కూడా ఏర్పాటు చేశాం. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, కరువు పరిస్థితులను అధిగమించేందుకు రూ.2వేల కోట్లతో విపత్తు సహాయ నిధికి రూపకల్పన చేశాం. రూ.7వేల కోట్లతో 30 లక్షల మందికి ఇళ్లపట్టాలు అందిస్తున్నాం. మహిళల పేరిట ఈ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయిస్తాం. నాలుగేళ్లలో 25 లక్షల గృహాలను సమకూరుస్తాం. 15 లక్షల ఇళ్లకు సంబంధించి ఆగస్టులో పనులు ప్రారంభమవుతాయని వివరించారు. జలయజ్ఞం కార్యక్రమం ద్వారా ఉద్దేశించిన 54 సాగునీటి ప్రాజెక్ట్‌ల్లో14 ప్రాజెక్ట్ పనులు పూర్తి చేశామని గవర్నర్ బిశ్వభూషణ్ అన్నారు. మిగిలిన ప్రాజెక్ట్ పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ ఏడాది పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్, సంగం బ్యారేజీ నెల్లూరు బ్యారేజీ, వంశధార రెండోదశ, వంశధార-నాగావళి అనుసంధానం అవుకు రెండో సొరంగం ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తాం. విద్యుత్ బకాయిలకు సంబంధించి డిస్కంలకు రూ.17904 కోట్లు కేటాయించాం. ఏపీఐఐసీ ద్వారా 1466పైగా కంపెనీలకు భూములు కేటాయించాం. దీని ద్వారా 36,810 మందికి ఉద్యోగ అవకాశాలు, రూ.11548 కోట్ల పెట్టుబడులు వస్తాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం వైఎస్ఆర్ నవోదయ పథకాన్ని ప్రారంభించాం. భోగాపురం, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు పనులను వేగవంతం చేశాం. జీఎంఆర్ సంస్థతో రూ.2,300 కోట్ల మేర భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడులో మూడు కొత్త ఓడరేవుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. రూ.3200 కోట్ల వ్యయంతో మూడేళ్లలో 8 చేపలు పట్టే ఓడరేవులను నిర్మిస్తామని గవర్నర్ వెల్లడించారు. కోవిడ్ వ్యాప్తిని నిరోధించడానికి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుందని గవర్నర్ అన్నారు. కరోనా పరీక్షల నిర్వహణలో ఇతర రాష్ట్రాలకంటే ఏపీ ముందుంది. రోజుకు దాదాపు 15వేల పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే 5.5 లక్షల పరీక్షలు పూర్తి చేశాం. రాష్ట్రంలో మరణాల రేటు.. జాతీయ సగటు కంటే చాలా తక్కువగా ఉన్నాయి. రికవరీ రేటు.. జాతీయ సగటు కంటే చాలా ఎక్కువగా ఉంది. ప్రభుత్వం టెస్టింగ్ ల్యాబ్‌లను 1 నుంచి 13కు పెంచింది. రాష్ట్రంలో 5 ప్రత్యేక కోవిడ్ ఆస్పత్రులున్నాయి. కరోనా నివారణకు జిల్లాల్లో 65 ఆస్పత్రులు. 5,400 ఐసీయూ బెడ్స్, 38వేల ఐసోలేషన్ బెడ్స్ ఆక్సిజన్ సరఫరాతో 15వేల బెడ్స్ ఉన్నాయని పేర్కొన్నారు.

# అభివృద్ధిని చూసే టీఆర్ఎస్ లో చేరికలు



మహబూబ్ నగర్, జూన్ 16: టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్ లో పెద్ద ఎత్తున చేరుతున్నారు. తాజాగా మహబూబ్ నగర్ పట్టణంలో బీజేపీ నుంచి 22 వార్డు కౌన్సిలర్‌గా ఎంపికైన రష్మిత.. ఆబ్కారి, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో టీఆర్ఎస్ లో చేరారు. కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాతో పాటు మున్సిపాలిటీ అభివృద్ధికి మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేస్తున్న అభివృద్ధి, టీఆర్ఎస్ విధివిధానాలకు ఆకర్షితులై బీజేపీకి రాజీనామా చేసి మంత్రి సమక్షంలో టీఆర్ఎస్ లో చేరినట్లు వారు వెల్లడించారు. కౌన్సిలర్ రష్మితతో పాటు బీజేపీ నాయకులు భాస్కర్, రమేష్, ప్రదీప్, అనుదీప్ పార్టీలో చేరారు.

# భారత్ ఒత్తిడితో దారికొచ్చిన పాక్

### దౌత్యాధికారుల విడుదలకు అంగీకారం

న్యూఢిల్లీ,జూన్16(ఆర్ఎన్ఎ): భారత ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి పెట్టడంతో దాయాది పాకిస్తాన్ దారికొచ్చింది. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్‌కు చెందిన ఇద్దరు సిబ్బంది అదృశ్యం కావడంతో భారత్ సీరియస్ అయింది. అంతేకాకుండా పాక్ హై కమిషనర్‌ను చర్చలకు కూడా పంపింది. దీంతో అదృశ్యమైన అధికారులను సోమవారమే విడుదల చేస్తామని పాక్ అంగీకరించినట్లు సమాచారం. ఇద్దరు భారత అధికారుల్ని రోడ్డు ప్రమాదం కేసులో అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఓ పాదచారికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై పాక్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. వారు చేసిన తప్పిదం బెయిలబుల్ అంశం కిందికి వస్తుందని, అందుకే సోమవారమే వారిని విడుదల చేసే అవకాశాలున్నాయని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆ ఇద్దరు అధికారుల్ని ఎలాంటి విచారణ చేయవద్దని, వేధింపులకు గురిచేయవద్దని భారత్ షరతు విధించింది. వారిని క్షేమంగా చేర్చేలా చూడాలని కూడా పాక్ అధికారులకే తేల్చి చెప్పడంతో పాకిస్తాన్ ఓ మెట్టు దిగిన్నట్లైంది. పాకిస్థాన్‌లో సోమవారం ఉదయం ఇండియన్ హై కమిషన్‌కు చెందిన ఇద్దరు అధికారులు అదృశ్యమయ్యారు. అధికారిక పనిలో ఉన్న సమయంలో ఇద్దరు అధికారులు అదృశ్యమైనట్టు పాకిస్థాన్‌లోని ఇండియన్ హై కమిషన్ తెలిపింది. ఇటీవల పాకిస్థాన్ హై కమిషన్‌కు చెందిన ఇద్దరు అధికారులు గూఢ చార్యానికి పాల్పడిన కారణంగా.. భారత ప్రభుత్వం వారిని దేశం నుంచి బహిష్క రించింది. ఆ సంఘటన జరిగిన కొద్ది రోజుల తరువాత భారత హై కమిషన్‌కు చెందిన అధికారులు అదృశ్యమవడం ఆం దోళన కలిగించింది. మరోపక్క ఇండియన్ హై కమిషన్ ఈ అంశాన్ని పాకిస్థాన్ విదేశాంగశాఖ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే.

## నీటమూటలా గవర్నర్ ప్రసంగం

### -కేటాయింపులకు పొంతన లేదన్న టిడిపి

అమరావతి,జూన్16(ఆర్ఎన్ఎ): గవర్నర్ ప్రసంగం నీటిని మూటకట్టుకొచ్చినట్టుగా ఉందని మాజీ మంత్రి జవహర్ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం ద్వారా అసత్యాలను చెప్పించారన్నారు. అమ్మ ఒడి ఉన్న విద్యార్థులలో సగం మందికే ఇచ్చారని... నాన్న జేబుకు చిల్లు పెట్టింది చెప్పించాల్సిందని ఎద్దేవా చేశారు. అమ్మ ఒడి 42 లక్షలు అయితే.. జగన్న కిట్లు 39 లక్షల మందికే ఎలా అని ప్రశ్నించారు. సీపీఎస్‌పై ఊసేలేదని వ్యాఖ్యానించారు. చేసిన మోసాలపై చెప్పించాలని డిమాండ్ చేశారు. దళిత బడుగు బలహీన వర్గాల మహిళలకు 45 ఏళ్లకు పెన్షన్ మాట మరిచారన్నారు. నీటి ప్రాజెక్ట్‌ల విషయంలో ప్రాజెక్ట్‌ల పనులు చూస్తే ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగంలా ఉందని జవహర్ దుయ్యబట్టారు. గవర్నర్ చేసింది పసలేని ప్రసంగమని టీడీఎల్పీ ఉపనేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యానించారు. అభివృద్ధికి ఆమడదూరంలో తమ ప్రభుత్వం ఉందని ప్రసంగ ద్వారా స్పష్టం చేశారన్నారు. వర్చువల్‌గా గవర్నర్ ప్రసంగం జరిగిన తీరులోనే ప్రసంగాలను వర్చువల్‌గా పెట్టి 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ లేని సమయంలో కూడా జె టాక్స్ కోసం సిమెంట్ ధర రూ.100 పెరిగిందని... ఏడాదిలోనే జె టాక్స్ రూపేణా రూ.25వేల కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. రూ.86వేల కోట్ల అప్పులు చేసినా ఎక్కడా అభివృద్ధి లేదన్నారు. రాష్ట్రంలో దాదాపు 15వేల పై చిలుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారంటే చట్టాన్ని ఏ విధంగా దుర్వినియోగం చేస్తున్నారో అర్థమవుతోందన్నారు.

## నల్లచొక్కాలతో టిడిపి సభ్యుల నిరసన

### -గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించిన బాబు బృందం

అమరావతి,జూన్16(ఆర్ఎన్ఎ): ఏపీ అసెంబ్లీ సమావేశంలో గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించగా... టీడీపీ సభ్యులు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు.. కక్షసాధింపు, వేధింపులు అంటూ నినాదాలు చేశారు. సభలో ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.. దీనికి నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నామన్నారు. ఇటు మండలిలో టీడీపీ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. గవర్నర్ ప్రసంగం అబద్దాల పుట్ట.. అక్రమ అరెస్టులు ఆపాలని... ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ టీడీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. ఇదిలా ఉంటే టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పీపీఈ కిట్ ధరించి సభకు రావడం విశేషం. కరోనా భయంతో ఆయన ఈ జాగ్రత్త తీసుకున్నారు.. టీడీపీ అధినేత చంద్రబాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి రావడానికి ముందు వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. చంద్రబాబుతో సహా పార్టీనేతలంతా నల్లచొక్కాలు ధరించి అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని.. తాజా పరిణామాలపై ఇలా నిరసన తెలిపారు. అసెంబ్లీ రెండు రోజుల పాటూ సాగనుండగా.. టీడీపీ మాత్రం కనీసం 15 రోజులు నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది.

## టిడిపి నేతలను భయపెట్టేందుకే అరెస్టులు

### -మండిపడ్డ పార్టీ నేతలు

అమరావతి,జూన్16(ఆర్ఎన్ఎ): వైసీపీ అవినీతి బురదను టీడీపీకి అంటించాలని చూస్తున్నారని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. అక్రమ కేసులు, అరెస్ట్‌లతో టీడీపీ నేతలపై వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. అచ్చెన్నాయుడు పట్ల వైసీపీ ప్రభుత్వం అత్యంత దారుణంగా ప్రవర్తించిందని విమర్శించారు. అధికారం శాశ్వతం కాదన్నది వైసీపీ నేతలు గుర్తు పెట్టుకోవాలన్నారు. రెండేళ్ల తర్వాత ఉంటారో లేదో వంతపాడే మంత్రులు తెలుసుకోవాలని సూచించారు. జేసీ బ్రదర్స్‌పై అక్రమంగా 21 కేసులు పెట్టారని చెప్పారు. నోటీసు ఇవ్వకుండానే అచ్చెన్నాయుడు, జేసీ ప్రభాకర్‌రెడ్డి అరెస్ట్ చేశారని టీడీపీ నేత పయ్యావుల కేశవ్ విమర్శించారు. పార్టీ శ్రేణులను భయపెట్టేందుకే టీడీపీ నేతలను అరెస్ట్ చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో నియంతపాలన ఎక్కువకాలం కొనసాగదన్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రజా సమస్యలున్నాయని.. చర్చకు పట్టుబడతామన్నారు. అసెంబ్లీ షెడ్యూల్ ముందే నిర్ణయించుకున్నారన్నారు. బీఏసీ సమావేశం నామమాత్రంగానే నిర్వహిస్తున్నారని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

## ముచ్చటగా మూడు రాజధానులు

### -గవర్నర్ ప్రసంగంలో మరోమారు ప్రస్తావన

అమరావతి,జూన్16(ఆర్ఎన్ఎ): గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రసంగంలో 3 రాజధానుల అంశం ప్రస్తావనకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల్లో భాగంగా ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా 3 రాజధానుల అంశం గురించి మాట్లాడారు. మా పాలనలో పరిపాలన వికేంద్రికరణ కీలక అంశం. మూడు రాజధానులు కలిగి ఉండే అవకాశం. శాసనం ప్రక్రియలో ఉంది. అమరావతి శాసన రాజధానిగా, విశాఖ కార్యనిర్వాహక రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా ఉంటుందని గవర్నర్ ప్రసంగించారు. బ్జడెట్ సమావేశాల నేపథ్యంలో తొలిసారి ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ప్రసంగించారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించడం సంప్రదాయం. అయితే ఈ సారి కరోనా మహమ్మారి నేపథ్యంలో గవర్నర్ అసెంబ్లీకి వచ్చే అవకాశం లేకపోవడంతో ఆయన ఆన్‌లైన్ ద్వారానే ఎపి బ్జడెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. గవర్నర్ ఆన్‌లైన్ ద్వారా అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించడం అనేది దేశంలో ఇదే మొదటి సారి. ఈ సందర్భంగా స్వచ్ఛమైన, అవినీతిరహిత మైన పాలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అందులో భాగంగానే రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా సుమారు రూ.2,200 కోట్లు ఆదా చేశామని గుర్తుచేశారు. అలాగే మూడురాజధానుల విషయాన్ని ప్రస్తావించారు. గడిచిన ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ

## కరోనాకు విరుగుడుగా ధన్వంతరి యాగం

బెంగళూరు,జూన్16(ఆర్ఎన్ఎ): ప్రపంచ దేశాల్లో కరోనా మహమ్మారి కరాళ నృత్యం చేస్తున్న వేళ భారత్‌లో అనేక ప్రాంతాల్లో పూజలు పునస్కారాలు చేస్తున్నారు. కరోనా పోవాలంటూ వేడుకుంటున్నారు. దేశంలోనూ కరోనా కలకలం రేపుతున్న వేళ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసుల సంఖ్య రోజురోజుకు వేగంగా పెరుగుతుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు ఆస్పత్రుల్లో కరోనా రోగుల కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నాయి. అయినా కరోనా కేసుల సంఖ్య పెరుగడమే తప్ప తగ్గడంలేదు. ఈ నేపథ్యంలో కరోనా మహమ్మారి తగ్గిపోవాలని కోరుతూ కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని శంకర్‌మఠ్‌లో ధన్వంతరీ యాగం నిర్వహించారు. ఈ యాగానికి కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప, ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కే సుధాకర్ ఈ యాగంలో పాల్గొన్నారు. గతంలో తిరుమల ఆలయంలో కూడా ధన్వంతరి యాగం నిర్వహించారు.

## కరోనా బాధిత మీడియా ప్రతినిధులకు సాయం

హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): తెలంగాణలోని పలు మీడియా సంస్థలకు చెందిన 25 మంది జర్నలిస్టులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఈ జర్నలిస్టులను ఆదుకునేందుకు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ముందుకొచ్చింది. 25 మంది జర్నలిస్టులకు ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున, హోంక్వారంటైన్‌లో ఉన్న జర్నలిస్టులకు రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నట్లు మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ప్రకటించారు. ఇప్పటి వరకు మొత్తం రూ. 5 లక్షల పదివేల ఆర్థిక సాయం చేసింది మీడియా అకాడమీ.

# మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం



వేములవాడ,జూన్ 16(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని భీమేశ్వర ఆలయం వీధిలోని అన్నపూర్ణ మెస్ పైన మొట్టమొదటిసారిగా వసుదైక ఫౌండేషన్ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి కోసం ఉచితంగా కుట్టు మిషన్ ,మగ్గం వర్క్,బ్యూటీషన్ శిక్షణ కేంద్రంను మున్సిపల్ వైస్ చైర్మన్ మధు రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ శిక్షణతో స్వయం ఉపాధి పొంద వచ్చిందని అన్నారు .ఈ లాక్ డౌన్ కాలంలో ఆడపడుచులకు ఇదొక వరమని అన్నారు .ఈ సందర్భంగా పలువురు మహిళలు హర్షం వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు అన్నారం ఉమారాణి శ్రీనివాస్ ,వంగల దివ్య శ్రీనివాస్ , టీఆర్ఎస్ నాయకులు అన్నారం శ్రీనివాస్ ,వంగల శ్రీనివాస్ ,సొసైటీ సభ్యురాలు మాధవి,గోపన్నగారి మాధవి , రాగంపేట రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ఆత్మనిర్భర్ భారత్ జన సంపర్క్ అభియాన్ కార్యక్రమం

## ఇంటింటికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశం

వేములవాడ,జూన్ 16(నేటినిజం ప్రతినిధి):భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వేములవాడ



మున్సిపాలిటీలో ఆత్మనిర్భర్ భారత్ జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ ముప్పిడి సునంద శ్రీనివాస్ ఆధ్వర్యంలోపట్టణంలోని 26వార్డుల్లో 250,251బూతు లో ఇంటింటికి తిరుగుతూ ప్రధాని నరేంద్రమోడీ సందేశాన్ని,కరపత్రాలను పంచుతూ నరేంద్రమోదీ ఒక సంవత్సరపాలన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు వివరించారు. అనంతరం కౌన్సిలర్ సునంద శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి విజృంభిస్తున్న తరుణంలో నరేంద్రమోదీ సాహసోపేతమైన నిర్ణయాల వలన దేశ ప్రజలకు ఎక్కువ ప్రాణహాని జరగలేదని, కరోనా నైపథ్యంలో జన్ ధన్ యోజన ద్వారా ఆర్థిక సహాయం, రాష్ట్రాలకి 20 లక్షల కోట్ల ప్యాకేజీ వలన ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. . ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# కరోనా వైరస్ నివారణ కు మాస్క్ ... శ్రీరామరక్ష...!!

## - జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాస్క్ ల పంపిణీ...

వేములవాడ,జూన్ 16(నేటినిజం ప్రతినిధి):ంప్రభుత్వ ఆదేశాల ప్రకారం



జిల్లా వైద్యడ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాస్క్ ల పంపిణీ కార్యక్రమాన్ని పురపాలక సంఘ అధ్యక్షురాలు రామతీర్థపు మాధవి రాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం అధ్యక్షురాలు రామతీర్థపు మాధవిరాజు మాట్లాడుతూ కరోనా వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండడం కోసం ప్రజలు అవసరం మేరకే బయటకు రావాలని తప్పనిసరిగా మాస్క్ ధరించాలని, శానిటైజర్ లు వాడాలని తప్పనిసరిగా సామాజిక దూరాన్ని పాటించాలని కోరారు. కరోనా వైరస్ చిన్న పిల్లలకు, వృద్ధులకు త్వరగా వచ్చే అవకాశం ఉన్నందున వారు అవసరం మేరకు మాత్రమే బయటకు రావాలని, లేనిపోని అపోహలను నమ్మి భయపడకూడదన్నారు.

'ముఖ్యమంత్రి కె.సి.ఆర్' కరోనా నివారణ కోసం అవసరమైన అన్ని కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

మన 'నియోజకవర్గ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు' ప్రజలను ఆదుకోవడం కోసం ఎప్పుడు ముందుంటున్నారన్నారు.

ఈ సందర్భంగా వివిధ వ్యాధిగ్రస్తులకు 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఒక్కరికీ రెండు మాస్క్ ల చొప్పున పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావు, వైద్యాధికారి రేగులపాటి మహేష్ రావు, కౌన్సిలర్ లు సిరిగిరి రామచంద్రం, యాచమనేని శ్రీనివాసరావు వైద్యులు ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపిలో కొత్తగా 193 పాజిటివ్ కేసులు

అమరావతి,జూన్16(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో మంగళవారం కొత్తగా 193 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు ఏపీ వైద్యారోగ్యశాఖ హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలోని మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 5280కి చేరింది. గడిచిన 24 గంటల్లో 15,911 మందికి పరీక్షలు నిర్వహించగా.. వారిలో 193 మందికి కోవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. తాజాగా చిత్తూరు, ప్రకాశం నుంచి రెండు మరణాలు

చోటుచేసుకకోవడంతో మొత్తం మృతుల సంఖ్య 88కి చేరింది. కాగా ఇవాళ కొత్తగా 88 మంది కరోనా నుంచి కోలుకొని డిశ్చార్జి కాగా ఇప్పటి వరకు వైరస్ నుంచి 2851 మంది కోలుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2341 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

# భారత్‌లో విజృంభిస్తున్న కరోనా

## జూలై నాటికి 8లక్షలకు చేరుకుంటుందన్న అధ్యయనం

న్యూఢిల్లీ,జూన్16(ఆర్ఎన్ఎ): దేశంలో ఇప్పటికే కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్నది. రోజురోజుకు కరోనా పాజిటివ్ కేసులు, మరణాల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది. సగటున రోజుకు పదివేలకు పైగానే కొత్త కేసులు నమోదవుతున్నాయి. దీంతో దేశంలో కరోనా బాధితుల సంఖ్య ఇప్పటికే మూడు లక్షల నలభై నాలుగు వేలకు చేరింది. మరణాలు కూడా దాదాపుగా పది వేలకు చేరుకున్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. ఈ నేపథ్యంలో అమెరికాలోని మిచిగాన్ యూనివర్సిటీ నిర్వహించిన ఓ అధ్యయనానికి సంబంధించిన నివేదిక దేశ ప్రజల్లో కలకలం రేపుతున్నది. జూలై 15లోగా భారత్‌లో కరోనా కేసుల సంఖ్య ఎనిమిది లక్షలకు చేరుకుంటుందని ఆ అధ్యయనంలో స్పష్టమైంది. భారత్‌లో తొలి కరోనా కేసు జనవరి 30న నమోదైంది. జూన్ 15 వరకు మొత్తం కేసుల సంఖ్య 3,43,091కి చేరింది. అంటే 138 రోజుల్లో కరోనా కేసుల సంఖ్య దాదాపు మూడున్నర లక్షలకు చేరుకుంది. ఈ నేపథ్యంలో జూలై 15లోగా కేసుల సంఖ్య ఎనిమిది లక్షలకు చేరుకుంటుందని మిచిగాన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది.

# నేటి కెటిఆర్ వరంగల్ పర్యటన వాయిదా

## కరోనా నేపథ్యమే కారణమన్న వినయ్ భాస్కర్

వరంగల్,జూన్16(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ పర్యటన వాయిదా పడింది. బుధవారం ఆయన వరంగల్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో ఆయన పర్యటన వాయిదా పడినట్టు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ వెల్లడించారు. బుధవారం ఆయన వరంగల్‌లోని రాంపూర్‌లో ఆక్సిజన్ పార్కుకు శంకుస్థాపన చేయాల్సి ఉంది. అలాగే, ఖాజీపేటలోని కడిపికొండ జంక్షన్ వద్ద మడికొండ వాసులకు చెందిన 200 డబుల్ బెడ్‌రూం గదుల ఇళ్లు, ఖాజీపేటలో స్థానికుల కోసం నిర్మించ బోయే 97 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు శంకుస్థాపన చేయాల్సి ఉంది. అలాగే మరికొన్ని అభివృద్ధి పనులకు ప్రారంబ ోత్సవం చేయాల్సి ఉన్నప్పటికీ కరోనాతో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో మంత్రి తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఇప్పటికే పలు కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లుకూడా చేశారు.

# తెలంగాణలో మూడ్రోజులు వర్షాలు

హైదరాబాద్,జూన్16(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో మూడ్రోజుల పాటు వర్షాలు పడే అవకాశమున్నట్లు తెలంగాణ వాతావరణ శాఖ సోమవారం తెలిపి ంది. అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరుగా కురవనున్నట్లు పేర్కొంది. ఉ త్తర బంగాళా ఖాతం పరిసరాల్లో త్వరలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున ఇవాళ, రేపు, ఎల్లుండి, రాష్ట్ర వ్యాప్తంగా దాని ప్రభావం ఉండనుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడిం చారు. ఇప్పటికే పడిన వర్షాలకు కొన్నిచోట్ల గ్రామాల్లో రైతులు దుక్కులు దున్ని పత్తి విత్తనాలు నాటారు. మరోసారి వర్షం పడితే రాష్ట్ర మంతటా ప్రభుత్వం సూచించిన పంటలను పండించడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే అన్నిచోట్ల ఎరువులు, విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధంగా ఉ ంచగా.. రైతులు సాగు పనుల్లో బిజీగా గడుపుతున్నారు.

# 2,24,789.19 కోట్లతో బడ్జెట్

## 80,392.65 కోట్ల రెవెన్యూ వ్యయం
## 4,396.54 కోట్ల పెట్టుబడి వ్యయం
## కేటాయింపులు తగ్గినా వ్యవసాయానికే పెద్దపీట
## రైతు భరోసాకు 3615 కోట్లు కేటాయింపు
## రైతులకు వడ్డీలేని రుణాల కోసం1100 కోట్ల కేటాయింపు
## ధరల స్థిరీకరణ నిధికి 3 వేల కోట్లు
## అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి బుగ్గన

అమరావతి,జూన్16(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ బ్జడెట్‌లో వ్యవసాయరంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. వ్యవసాయ రంగానికి 11 వేల 891 కోట్లను కేటాయించింది. ఏపీ అసెంబ్లీలో ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బడ్జెట్ ప్రవేశపెట్టారు. రెండోసారి ఆయన అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతూ బడ్జెట్‌ను తెలుగులో చదివారు. బడ్జెట్ అంచనా వ్యయం రూ.2,24,789 కోట్లుగా, రెవెన్యూ అంచనా రూ.1,80,392 కోట్లు, మూలధన వ్యయం రూ.44,396 కోట్లుగా బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలియజేశారు. ఇకపోతే రైతు భరోసాకు 3615 కోట్లు కేటాయించారు. విత్తనాల పంపిణీ కి 200 కోట్లను కేటాయించారు. రైతులకు నష్ట పరిహారం కోసం గానూ 20 కోట్లను కేటాయించారు. అదే విధంగా రైతు భరోసా కేంద్రాలకు గానూ వంద కోట్లు కేటాయించారు. రైతులకు వడ్డీలేని రుణాలు 1100 కోట్లను కేటాయించారు. కరోనాపై పోరులో ముందున్నామని ప్రకటించారు. కరోనా సందర్భంగా ఆర్థిక వ్యవస్థ కుంటుపడకుండా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. 2018-19లో స్థూల ఉత్పత్తి 8శాతమే పెరిగింది. గత ప్రభుత్వం మిగిల్చిన అప్పులు సునామిలా మీద పడ్డాయని బుగ్గన అన్నారు. నేషనల్ హార్టీ కల్చర్ మిషన్ కోసం 150 కోట్లను కేటాయించారు. వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ లాబ్స్ కోసం గానూ 65 కోట్లను కేటాయించారు. మత్స్యకారులకు కూడా 109 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ధరల స్థిరీకరణ నిధి కి 3 వేల కోట్లను కేటాయించారు. ఇదో చారిత్రాత్మక నిర్ణయమని బుగ్గన తెలిపారు. శాసన మండలిలో ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. ఆర్థిక మంత్రి బుగ్గన బ్జడెన్ ప్రవేశపెడుతూ.. కరోనా మహమ్మరి కారణంగా బ్జడెట్ అంచనాలు 1.4 శాతం తగ్గిన తగ్గాయని వెల్లడించారు. 2020-21 ఏడాదికిగాను రూ.2,24,789.19 కోట్ల అంచనా వ్యయంతో సంక్షేమ బ్జడెట్‌ను ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. ఇందులో రెవిన్యూ లోటు రూ.18, 434.14 కోట్లుగా అంచనా వేసినట్టు తెలిపారు. ఆర్థిక లోటు దాదాపు రూ. 48,295.58 కోట్లు ఉ ండవచ్చని అంచనా వేశారు. రాష్ట్ర స్థూల అభివృద్ధి ఉత్పత్తిలో 4.78 శాతం ఆర్థిక లోటు, 1.82 శాతం రెవిన్యూ లోటుగా ఉ ంటుందని చెప్పారు. 2019-20, 2020-21 సంవత్సరాల్లో కేంద్ర పన్నుల బదలాయింపులో తగ్గుదల, 2020-21 సంవత్సరానికి సంబంధించి డివిజబుల్ పూల్‌లో తగ్గిన వాటాతోపాటు, కోవిడ్-19 వల్ల ప్రకటించిన లాక్‌డౌన్ చర్యలతో తగ్గుముఖం పట్టిన ఆదాయ వనరులు మన ఆర్థిక సమస్యను మరింత తీవ్రతరం చేశాయని అన్నారు. ఎవరైనా తాము చేపట్టాలనుకుంటున్న మార్పును సాధించడ ానికి పరిపూర్ణంగా అంకితమైతే ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించి విజయం సాధి స్తారు' అని సీఎం వైఎస్ జగన్ అన్న మాటల్ని ఆర్థిక మంత్రి బుగ్గన ఉటంకించారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

బడ్జెట్‌లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. పేదలకు పూర్తి స్థాయి ఆరోగ్య సేవలను

అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం ముందుకెళ్తుంది. 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం' పరిధిని విస్తరించింది. ఇప్పటికే అందుబాటులో ఉన్న 1059 ఆరోగ్య విధానాలతో పాటు, అదనంగా 1000 ఆరోగ్య విధానాలను కూడా ప్రవేశపెట్టింది. ఈ ఏడాది జనవరి నుంచి స్మార్ట్ హెల్త్ కార్డుల పంపిణీ మొదలయ్యింది. దాదాపు కోటి 42 లక్షలు మేరకు కార్డులు పంపిణీ కానున్నాయి. పేద కుటుంబాలకు చెందిన రోగులకు శస్త్ర చికిత్సలు అవసరమైనప్పుడు వారు కోలుకోవటానికి పట్టే కాలంలో ఉపాధి లభించడం కష్టం కాబట్టి, ఆ నష్టాన్ని భర్తీ చేయడానికి 'వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం' కింద రోజుకు 225 రూపాయలు మేరకు శస్త్రచికిత్స అనంతర భత్యాన్ని మంజూరు చేస్తున్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో నివసిస్తున్న పేద కుటుంబాల సౌకర్యం కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద 130 ఆసుపత్రులను ఎంపిక చేశారు. అందరికీ కంటి పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు, సదుపాయాలు అందించాలనే ఉ ద్దేశ్యంతో గత ఏడాది అక్టోబర్ 10న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో మొదటి విడతగా 69 లక్షలు, రెండో విడతగా 4 లక్షల 60 వేల మంది పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మూడో దశలో 60 ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహించడంతో పాటు కళ్లద్దాలు కూడా అందించనున్నారు. తదుపరి రాష్ట్ర ప్రజలందరూ కంటి వెలుగు పథకం కింద లబ్ధిపొందనున్నారు. 2020-21 సంవత్సరానికి గాను రూ.20 కోట్లు బ్జడెట్‌ను ప్రతిపాదించారు.

అత్యవసర వైద్యసేవలను ప్రజలకు సకాలంలో అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. ఇందుకుగాను '108 అంబులెన్స్ పథకం' కింద 439 అంబులెన్స్‌లను ప్రతి మండలానికి ఒక్కొక్కటి చొప్పున కేటాయించనున్నారు. సంచార వైద్య వాహనాలను కూడా పెంచనున్నారు. 1000 కొత్త వాహనాలను ఈ ఏడాది ప్రారంభించనున్నారు. 108, 104 సేవల కింద రూ.470.29 కోట్లు బ్జడెట్‌ను

ప్రతిపాదించారు. వైద్య ఆరోగ్య రంగంలో 'నాడు-నేడు' పథకం కింద సబ్ సెంటర్ల నుంచి టీచింగ్ ఆసుపత్రుల దాకా మౌలిక సదుపాయాలు,వైద్య సామాగ్రి, అదనపు మానవ వనరుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామ,వార్డు స్థాయిలో 11,000కు పైగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నెలకొల్పనున్నారు. రాష్ట్రం అంతటా దశలవారీగా 15 కొత్త వైద్య కళాశాలలను ప్రారంభించనున్నారు. క్యాన్సర్, మూత్రపిండ సంబంధిత సమస్యల చికిత్సలకు 'నాడు-నేడు' పథకం కింద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను కూడా నిర్మించనున్నారు. ఈ పథకం కింద మొత్తం 1145 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 195 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, 28 ప్రాంతీయ వైద్యశాలలు, 13 జిల్లా ఆసుపత్రులు, 11 బోధన ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను ఆధునీకరించనున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి 9,700 మంది ఆరోగ్య సిబ్బందిని ప్రభుత్వం నియమించనుంది. వైద్య ఆరోగ్య శాఖలో ఇంత పెద్ద ఎత్తు నియామకాలు చేపట్టడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. ఆరోగ్యశాఖకు ఈ బ్జడెట్‌లో రూ.11,419.44 కోట్లను ప్రతిపాదించారు.

మహిళా శిశు సంక్షేమానికి ప్రాధాన్యం

రాష్ట్రంలో మహిళలు అభివృద్ధి పథంలో పయనించినప్పుడే రాష్ట్ర అభివృద్ధి మరింత ముందుకెళుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నోసార్లు పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా మహిళా,శిశు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పిన విధంగానే ఈ రంగానికి పెద్ద ఎత్తున కేటాయింపులు జరిపారు. ప్రభుత్వ విధాన లక్ష్యాల్లో అత్యంత ముఖ్యమైన వాటిలో స్త్రీ అభ్యున్నతి ఒకటని మంత్రి పేర్కొన్నారు. బడి ఈడు పిల్లలు నూటికి నూరు శాతం బడిలో చేరాలని, వాళ్లు బడి మానకుండా ఉండాలని, వారి ఆరోగ్య

ప్రమాణాలు మెరుగుపడాలని కోరుకుంటూ ప్రభుత్వం జగనన్న అమ్మ ఒడి పథకం ప్రారంభించింది. జగనన్న అమ్మ ఒడి పథకం కింద ఈ ఏడాది బ్జడెట్‌లో రూ. 6వేల కోట్లు కేటాయిస్తున్నట్లు బుగ్గన తెలిపారు. దీనివల్ల రాష్ట్రంలోని 8,68,233 మంది షెడ్యూల్ కులాల తల్లులకు, 19,65, 589 మంది వెనుకబడిన తరగతులకు చెందిన నిరుపేద తల్లులు, 2,76, 155 గిరిజన మాతృమూర్తులకు , 4, 03, 562 మంది ఆర్థికంగా వెనుకబడిన వారికి , 2,95, 540 మైనారిటీ వర్గాలకు చెందిన వారికి ఈ పథకం కింద సహాయమందనుంది.

వైఎస్సార్ చేయూత పథకం కింద రూ . 3వేల కోట్లు

రాష్ట్రంలో 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్కులైన స్త్రీలకు ఆర్థిక సహాయాన్ని పరిపుష్టం చేయడం కోసం వైఎస్సార్ చేయూత పథకం ఏర్పాటు చేశారు. ఈ పథకం కింద రూ . 3వేల కోట్లు కేటాయించారు. ఆర్థిక సంవత్సరంతో మొదలైన నాలుగు సంవత్సరాల పాటు షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సామాజిక వర్గాలకు చెందిన మహిళకు రూ. 18750 వార్షిక సహాయం అందించబడుతుంది. స్వయం స్వహాయక ఆర్థిక బృందాల కార్యకలాపాల్లో పెద్ద ఎత్తున గ్రామీణ, అసంఘటిత ఆర్థిక వ్యవస్థలో ఎంతో మంది స్త్రీలు ఆధారపడ్డారు. వీరిని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన పథకమే వైఎస్సార్ ఆసరా. ఇందుకుగానూ 2020-21 ఆర్థిక సంవత్సరానికి రూ. 6,300 కోట్లు కేటాయించారు. 2019 ఏప్రిల్ 11 నాటికి డ్వాక్రా మహిళలకు ఉన్న రుణం రూ. 27,168.83 కోట్ల బకాయిలను చెల్లించేందుకు నాలుగు దశల్లో ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పేదరికం, నిరక్షరాస్యత, వైద్య ఆరోగ్య పద్ధతులపై కనీస పరిజ్ఞానం లేకపోవడం, పోషక ఆహారం గురించి జాగ్రత్తలు తీసుకోకపోవడం, పరిసరాల అపరిశుభ్రత వంటివి దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రారంభించింది. 2020-21 ఏడాదికి గానూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాని?కి రూ . 1500 కోట్లు కేటాయించారు. దీని ద్వారా 7 సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల పరిధిలో ఉన్న 0.66 లక్షల గర్భిణీ బాలింత స్త్రీలు, 6 నుంచి 72 నెలల లోపు వయసు కలిగిన 3.18 లక్షల మంది చిన్నారులకు లబ్ధి చేకూరనుంది. దీంతో పాటు స్త్రీలు, శిశువులు, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ నిమిత్తం 2020-21 సంవత్సరానికి గానూ రూ. 3456 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ప్రభుత్వం తరఫున ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బ్జడెట్ ప్రసంగ సందర్భంగా కోవిడ్ వారియర్స్ ప్రస్తావన తెచ్చిన మంత్రి.. వారి సేవలను కొనియాడారు. ప్రపంచమంతా కోవిడ్-19 మహమ్మారితో కనీవిని ఎరుగని సంక్షోభాన్ని ఎందుర్కొంటోందని, దాని కారణంగా జీవన వ్యవహారమంతా ఒక్కసారిగా ఆగిపోయిందని అన్నారు. 'కరోనా వైరస్‌తో సాగిస్తున్న సమరంలో ప్రభుత్వం ముందు వరుసలో నిలబడమే కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పూర్తి అంకితభావంతో శాయశక్తులు ఒడ్డి పోరాడుతోంది. అన్నింటికన్నా ముందు ఈ సమయంలో ముందు వరుసలో నిలబడి నిస్వార్థంగా విధి నిర్వహణ చేస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందికి, గ్రామ, వార్డు వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, పంచాయతీ రాజ్, మున్సిపల్ సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అని అన్నారు.

### బడ్జెట్‌లో ముఖ్యాంశాలు ఇవే

వ్యవసాయానికి రూ.11,891 కోట్లు
వైఎస్ఆర్ రైతు భరోసాకు రూ.3,615 కోట్లు
ధరల స్థిరీకరణ నిధి రూ.3 వేల కోట్లు
వడ్డీ లేని రుణాల కోసం రూ.1,100 కోట్లు
మైనార్టీ సంక్షేమానికి రూ.1,998 కోట్లు
ఎస్టీల సంక్షేమానికి రూ.1,840 కోట్లు
ఎస్సీల సంక్షేమానికి రూ.7,525 కోట్లు
కాపుల సంక్షేమానికి రూ.2,845 కోట్లు
బీసీల సంక్షేమానికి రూ.23,406 కోట్లు
విద్యాశాఖకు రూ.22,604 కోట్లు
వైద్య రంగానికి రూ.11,419 కోట్లు
రోగ్యశ్రీకి రూ.2100 కోట్లు
వైఎస్ఆర్ గృహవసతికి రూ.3వేల కోట్లు
పీఎం ఆవాజ్ యోజన అర్బన్‌కు రూ.2540 కోట్లు
పీఎం ఆవాజ్ యోజన (గ్రామీణం) రూ.500 కోట్లు
బలహీనవర్గాల గృహ నిర్మాణానికి రూ. 150 కోట్లు
డ్వాక్రా సంఘాలకు రూ.975 కోట్లు
రేషన్ బియ్యానికి రూ.3వేల కోట్లు
వైఎస్ఆర్ పెన్షన్ కానుకకు రూ.16వేల కోట్లు
వైఎస్ఆర్ ఆసరాకు రూ.6,300 కోట్లు
అమ్మ ఒడికి రూ.6 వేల కోట్లు
జగనన్న విద్యాదీవెనకు రూ.3,009 కోట్లు
వైఎస్ఆర్ చేయూత పథకానికి రూ.3వేల కోట్లు
జగనన్న వసతి దీవెనకు రూ.2 వేల కోట్లు
వైఎస్ఆర్ కాపు నేస్తం పథకానికి రూ.350 కోట్లు
వైఎస్ఆర్ వాహన మిత్రకు రూ.275 కోట్లు
జగనన్న చేదోడుకు రూ.247 కోట్లు
నేతన్న నేస్తం రూ.200 కోట్లు
మత్స్యకార భరోసాకు రూ.109 కోట్లు

# వైరస్‌ను నాశనం చేసే ఆయుర్వేద ముఖ కవచం తయారు చేసిన డైయట్

## బాక్టీరియా, వైరస్‌ను సమర్థవంతంగా అడ్డుకున్న ఆయుర్వేద పరిజ్ఞానం
## దుస్తులు, గ్లోవ్స్, గౌన్లు, తల ముసుగుల తయారీకి సిద్ధం
## వాడేసిన తర్వాత భూమిలో కలిసిపోయేలా రక్షణ కవచాల రూపకల్పన
## ఆసక్తివున్న సంస్థలకు ఉచితంగా తయారీ పరిజ్ఞానం అందించేందుకు నిర్ణయం

హైదరాబాద్, జూన్ 16:వైరస్‌లను తుదముట్టించే కొత్త ముఖ కవచాన్ని "డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ" (డైయట్) అభివృద్ధి చేసింది. ఆయుర్వేద మూలికల ఆధారంగా దీనిని రూపొందించింది. ఈ మాస్క్‌కు "పవిత్రపతి"గా పేరు పెట్టింది. ఈ మాస్క్‌కు భూమిలో కలిసిపోయే గుణం ఉంది. వేప నూనె, పసుపు, కృష్ణతులసి, వాము, నల్ల మిరియాలు, తుమ్మజిగురు, లవంగాలు, చందనం, కుంకుమపువ్వు సారాలను ఉపయోగించి పవిత్రపతి మాస్కును తయారు చేశారు. అందువల్లే ఇది బాక్టీరియా, వైరస్, ఫంగస్ నాశినిగా పని చేస్తుంది. మూడు పొరలుగా రూపొందించిన మాస్క్ లోపలకు చెమ్మ, తుంపరలు, బాక్టీరియా, వైరస్ చేరలేవని రుజువైంది. గాలి ద్వారా వ్యాపించే ఏ విధమైన అంటువ్యాధులనైనా అడ్డుకునేందుకు, బయటకు వెళ్లేటప్పుడు మామూలు మాస్క్‌లా ధరించేందుకు ఇది ఉ పయోగపడుతుంది.ధరించినవారికి సులభంగా శ్వాస ఆడటంపై 'ఏఎస్‌టీఎమ్ డీ-737' ప్రమాణాలను; పర్యావరణహిత, తయారీ అంశాల్లో 'ఏఎస్‌టీఎమ్' ప్రమాణాలను ఈ మాస్క్ అందుకుంది.

మాస్క్ తయారీలో ఉపయోగించిన పదార్థాల సారం వైరస్‌ను నశింపజేసి, ధరించినవారికి రక్షణ కల్పిస్తుంది. వ్యక్తిగత రక్షణ పరికరాల (పీపీఈ) తరహాలో దీనిని భారీస్థాయిలో ఉ త్పత్తి చేయనున్నారు. మడతపెట్టి వెంట తీసుకెళ్లగలిగేలా దుస్తులు, గ్లోవ్స్, గౌన్, ముఖ కవచం, తల ముసుగు రూపాల్లో రూపొందించనున్నారు. ప్రొటీన్ అణువులను స్వభావరహితం చేసేందుకు కొన్ని నమూనాలను కూడా పరీక్షించి విజయం సాధించారు. భారీ స్థాయిలో ఉత్పత్తి చేయగల సామర్థ్యమున్న తయారీ సంస్థలకు ఈ రక్షణ కవచాల తయారీ పరిజ్ఞానాన్ని ఉచితంగా అందించాలని డైయట్ నిర్ణయించింది. వీటి తయారీకి కొన్ని సంస్థలు ఇప్పటికే ఆసక్తి కనబరిచాయి.

# చురుకుగా విస్తరిస్తున్న నైరుతి పవనాలు

## పలు రాష్ట్రాల్లో జోరుగా వానలు
## ఒడిషాలో అత్యదిక వర్షపాతం నమోదు
## వెల్లడించిన భారత వాతావరణ కేంద్రం

న్యూఢిల్లీ,జూన్16(ఆర్ఎన్ఎ): దేశంలో నైరుతి రుతుపవనాలతో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. జూన్ 1న కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు ఆ తర్వాత మెల్లగా కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోకి ప్రవేశించి ఇప్పుడు తూర్పు, ఈశాన్యం దిశగా కదులుతున్నాయి. ఇన్నాళు నిదానంగా కదిలిన నైరుతి బుతుపవనాలు ఇప్పుడు ఊపందుకున్నాయని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) తెలిపింది. ఈ రుతుపవనాల ప్రభావంవల్ల రానున్న 48 గంటల్లో ఉత్తర అరేబియా సముద్రం, గుజరాత్, దయ్యూ, మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. అదేవిధంగా ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాలు, జార్ఖండ్, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలు, ఉత్తరప్రదేశ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నట్లు ఐఎండీ వెల్లడించింది. మరోవైపు రాజస్థాన్ నుంచి బెంగాల్ వరకు అల్పపీడనం ఏర్పడనుందని, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలపై ఈ అల్పపీడనం ప్రభావం ఉంటుందని ఐఎండీ తెలిపింది. ఈ అల్పపీడనంవల్ల గోవాలోని కొంకణ్ ప్రాంతంలో భారీ నుంచీ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉ ందని వెల్లడించింది. అదేవిధంగా మహారాష్ట్ర, బెంగాల్, ఒడిశా, సిక్కింలలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. ఒడిశా రాష్ట్రంలో ఈ నెల 1నుంచి 15వరకు సాధారణం కంటే 23శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణశాఖ భువనేశ్వర్ డైరెక్టర్ బిశ్వాన్ సోమవారం తెలిపారు. సాధారణంగా ప్రతి ఏడాది జూన్ 1నుంచి 15వరకు 79.2మి.మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఈ సారి 97.4మి. మీటర్ల వర్షం కురిసిందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15జిల్లాల్లో భారీ వర్షాలు కురవగా 10జిల్లాల్లో సాధారణ వర్షం పడిందని, మిగిలిన చోట్ల లోటు వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. 24గంటల వ్యవధిలో బార్గా జిల్లాలో అత్యధికంగా 125మి.మీటర్ల వర్షం కురిసిందని తెలిపారు. రుతుపవనాల ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో సముద్ర తీరప్రాంతాలతోపాటు పలు ప్రాంతాల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిస్తున్నాయని పేర్కొన్నారు. ఉత్తర బెంగాల్ తీరంలో అల్పపీడనం ఏర్పాడే అవకాశముందని, దీని ప్రభావంతో ఉత్తర ఒడిశాలో జూన్ 18నుంచి 19వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. నైరుతి రుతు పవనాల ప్రభావంతో మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నిత్య ఏదో ఒకచోట వానలు పడుతూనే ఉన్నాయి. శు క్రవారం నాసిక్ ఏరియాలో కుండపోత వర్షం కురిసింది. దీంతో ఆ నగరంలోని లోతట్టు ప్రాంతాలన్ని జలమయ్యాయి. రోడ్లపైకి వరదలు పోటెత్తడంతో రహదారులన్నీ నదులను తలపించాయి. కొన్నిచోట్లు నడుముల లోతు నీళ్లు నిలువడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పలు ప్రాంతాల్లో సెల్లార్‌లలోకి వరద నీరు చేరింది. భారీ వర్షం కురువడంతో నాసిక్ మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టారు.

# కరోనా టెస్టు ఖర్చులు ప్రభుత్వమే భరించాలి

## గవర్నర్‌కు కాంగ్రెస్ లేఖ

హైదరాబాద్,జూన్16(ఆర్ఎన్ఎ): ప్రైవేట్‌గా చేసే కరోనా టెస్టుల ఖర్చు ప్రభుత్వమే చెల్లించేలా చూడాలని గవర్నర్ తమిళిసైకు కాంగ్రెస్ పార్టీ కోవిడ్ కమిటీ సభ్యులు లేఖ రాశారు. నిమ్స్‌లో టెస్టింగ్ లేకపోవడం విడ్డూరమని పేర్కొన్నారు. నిమ్స్‌లో టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తరహాలో కోవిడ్‌పై అల్ పార్టీ సమావేశం పెట్టలేదని తెలిపారు. డాక్టర్లపై జరుగుతున్న దాడులు గురించి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. 30 నియోజకవర్గాల్లో 50 వేల టెస్టుల నిర్ణయం మంచిదేనని చెప్పారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.